సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 5-7-2024 15/-



## కుప్పలు తెప్పలుగా
# ప్రాపగాండ సినిమాలు






కృత్రిమ మేధస్సు కాలంలో
వినిమయ వస్తువుగా జ్ఞానం

సహజీవన భావనల పావురాయి
# గీటురాయి
వారపత్రిక
## GEETURAI WEEKLY


Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in


సంపుటి: 46 సంచిక: 27 హైదరాబాద్
శుక్రవారం 5 జులై 2024 రూ.15-00
28 జిల్ హిజ్జహ్ 1445 హిజ్రీ


**తొలిగీటు**

మీరు ఇతరుల ముందు చేయి చాపకండి, ఇదే మీ ఆత్మాభిమానానికి నిదర్శనం

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షరీఫ్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**


కథ



22

**ఓ తండ్రి కథ**

## లోపల...


| | |
|---|---|
| మైనారిటీ రిపోర్ట్ ...... | 04 |
| కుప్పలు తెప్పలుగా ప్రాపగాండ సినిమాలు ...... | 05 |
| క్రీడాధన శ్రేష్ఠుడు – 36 ...... | 10 |
| విద్యాజ్ఞానాల గొప్పతనం ...... | 12 |
| అరాచకాలకు అంతం లేదా? ...... | 14 |
| అయోధ్యలో ఏం జరిగింది? ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) ...... | 18 |
| అడుగుజాడలు ...... | 19 |
| చరితార్థులు-2 : చౌదరి అఫ్జల్ హఖ్ ...... | 21 |
| ముహర్రం అల్లాహ్ మాసం (సందేహాలు-సమాధానాలు) ...... | 24 |
| బి పాజిటీవ్, ఫ్రెండ్స్! ...... | 27 |
| కృత్రిమ మేథస్సు కాలంలో వినిమయ వస్తువుగా జ్ఞానం ...... | 28 |
| ఇస్లాంలో స్త్రీకి సముచిత స్థానం ...... | 31 |
| గాంధీజీని రక్షించిందెవరు? చంపిందెవరు?? ...... | 32 |
| ఉర్దూ భాషాభివృద్ధికి గొప్ప ప్రయత్నం – క్విజ్ టైమ్ ...... | 34 |


## వలసలు...



కారు పార్టీ నుండి
కాంగ్రేసుకు వలస
కేసియార్ అస్సలు
ఉర్కోడట తెలుసా !
ఆంధ్రాలో ఐనట్లుగ
తెలంగాణలో కూడ
పోదు గదా ఓసారూ
గులాబి రంగు జాడ !!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

## ఆలోచన

# మైనారిటీ రిపోర్ట్

**ఎన్నికలు ముగిశాయి.** ఈసారి చాలా మార్పువచ్చిందని కొందరు సంతోషిస్తున్నారు. బీజేపీ ఇష్టారాజ్యం ఇక చెల్లదని కొందరు భావిస్తున్నారు. కాని ఏదీ మారని పరిస్థితి ముస్లిములకు ఉంది.

నరేంద్ర మోడీ మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత, 71 మంది సభ్యులతో కూడిన భారీ క్యాబినెట్ మొదటి సమావేశం ఆయన నివాసంలో జరిగింది. క్యాబినేట్ లో వెనుకబడిన కులాలు, తెగలు, మైనారిటీ మతాలు, మహిళలు అందరికీ ప్రాతినిధ్యం కనిపిస్తోంది. కాని ఒక్క ముస్లిం కూడా కనిపించడం లేదు. ఇది నేటి భారత ప్రజాస్వామ్యం నిజరూపం. దేశంలో దాదాపు 14శాతం జనాభాకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేదు.

కొత్త క్యాబినెట్లో ఏడుగురు మహిళా మంత్రులు, పదిమంది దళితులు, 27 మంది ఇతర వెనుకబడిన తరగతుల సభ్యులు ఐదుగురు మత మైనారిటీలు ఉన్నారు. ఎన్డీయే నుంచి ఎన్నికైన సిక్కు సభ్యుడు ఎవరు లేరు, అయినా ఓడిపోయిన రవ్నీత్ సింగ్ బిట్టు, రాజ్యసభ నుండి హర్దీప్ పూరి సిక్కు మంత్రులుగా కేబినేటులో కూర్చున్నారు. అలాగే 2024 ఎన్నికలలో పోటీ చేయని జార్జ్ కురియన్ క్రిస్టియన్ సముదాయం నుండి మంత్రిగా కనిపిస్తున్నారు. ఈ భారీ కేబినేటులో ఒక్క ముస్లిం ముఖం కనిపించకుండా చేయడం ద్వారా బీజేపీ తన సందేశాన్ని స్పష్టంగా చెబుతుంది. ఎన్డీయేకు మద్దతిస్తున్న నితీష్ కుమార్, చంద్రబాబునాయుడు కూడా ఈ సందేశాన్ని స్పష్టంగానే వింటున్నారు.

రాజకీయ ప్రాతినిధ్యం అనేది ఏ సముదాయానికైనా చాలా కీలకమైనది. 2014లో అన్ని రాజకీయ పార్టీలు కలిసి 320 ముస్లిం అభ్యర్థులను నిలబెట్టాయి. కానీ ఈ సంఖ్య 2024లో 94కి పడిపోయింది. బీజేపీ ఒక్క ముస్లిముకు కూడా టిక్కెట్టు ఇవ్వలేదు. మిగిలిన పార్టీలు కూడా చాలా తక్కువ సంఖ్యలో ముస్లిం అభ్యర్థులను నిలబెట్టాయి. బిజేపీ ఆరెస్సెస్‌లు సాధించిన విజయం ఇది. రాజకీయపార్టీలు ముస్లిములకు టిక్కెట్లు ఇవ్వకుండా ప్రభావితం చేయగలిగాయి. 2024లో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కూడా ముస్లిం అభ్యర్థులకు టిక్కెట్టు ఇవ్వలేదు. ప్రధాన ప్రతిపక్ష పార్టీలు 2024 ఎన్నికల్లో కేవలం 43 మంది ముస్లిం అభ్యర్థులను మాత్రమే నిలబెట్టాయి. 2019లో 115 మంది ముస్లిం అభ్యర్థులు ఉన్నారు.

ఆసక్తికరమైన విషయమేమిటంటే, ఎన్నికల్లో టిక్కెట్లు పొందిన ముస్లిం అభ్యర్థుల సంఖ్య గణనీయంగా తగ్గినప్పటికీ, ఎన్నికైన ముస్లిం అభ్యర్థుల సంఖ్య సమానంగానే ఉంది. అంటే 24 మంది ఈ సారి కూడా ఎన్నికయ్యారు. ముస్లిములకు టిక్కెట్లు ఇస్తే గెలుపు అవకాశాలు తగ్గిపోతాయంటూ సోకాల్డ్ సెక్యులర్ పార్టీలు వ్యూహాత్మకంగా టిక్కెట్లు ఇవ్వడం లేదని సమర్థించుకునే వాదనలో డొల్లతనాన్ని ఈ ఫలితాలు రుజువు చేస్తున్నాయి. 2024 ఎన్నికల్లో ముస్లిం అభ్యర్థులు విజయం సాధించిన రేటు ముస్లిమేతరుల కంటే ఎక్కువగా కనిపిస్తుంది.

మోడీ పాలనా కాలంలో ముస్లిం విద్వేషం, వ్యతిరేకత ప్రధానంగా రాజకీయాలు మారిపోయాయి. ముస్లిముల ప్రాతినిధ్యం పట్ల లేదా ముస్లిముల సమస్యల పట్ల మాట్లాడితే హిందువులు ఆగ్రహిస్తారనే భయాలు కాంగ్రెస్ తదితర పార్టీల్లో ఉన్నాయి. ఈ భయాలను మరింత పెంచడానికే మోడీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ గెలిస్తే హిందూ మహిళల మంగళసూత్రాలు కూడా లాక్కుని ముస్లిములకు పంచేస్తారనే ప్రచారం చేశారు. ఈ ప్రచారాన్ని హిందువులు నమ్మేస్తారేమో అనే భయంతోనే కాంగ్రెసు ముస్లిముల పట్ల దూరాన్ని పాటిస్తోంది. చివరకు ముస్లిములను భారత రాజకీయాల్లో అంటరానివారిగా మార్చడంలో బీజేపీ, ఆరెస్సెస్ విజయం సాధించాయి.

ఇప్పుడు రాజకీయ పార్టీలు అవి సెక్యులర్ పార్టీలైనా, కాకపోయినా ముస్లిముల రాజకీయ ప్రాతినిధ్యం గురించి మాట్లాడ్డానికి కూడా సిద్ధంగా లేవు. ఇప్పుడు ప్రశ్న భారత ముస్లింలు భారత ప్రజాస్వామ్యంలో సమాన హక్కులు కలిగిన పౌరులుగా పరిగణించబడుతున్నారా లేదా? ఈ ప్రశ్నకు సెక్యులర్ పార్టీలు ఆచరణాత్మకంగా సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

అబ్దుల్ వాహెద్




తెలుగు నాట భక్తిరసం
తెప్పలుగా పారుతోంది
డ్రైనేజీ స్కీములేక
డేంజరుగా మారుతోంది

గజ్జెల మల్లారెడ్డి ఎప్పుడో రాసిన కవిత ఇది. కాని ఇప్పుడు ఈ పాదాలను కాస్త మార్చుకోవడం అవసరం. భక్తిరసం పెరగడం వల్ల పెద్ద ప్రమాదమేమీ ఉండదు. కాని మతతత్వం పెరగడం వల్ల చాలా ప్రమాదం. అందువల్ల

దేశంలో మతతత్వం... అని మొదటి లైను మార్చుకోవలసి ఉంటుంది.

బాలివుడ్‌గా పిలువబడే హిందీ చిత్ర పరిశ్రమ ఒకప్పుడు అద్భుతమైన సినిమాలతో ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందింది. కాని గత దశాబ్ధకాలంగా ఈ పరిస్థితి మారి పోయింది. ఇప్పుడు ప్రాపగాండ సినిమాలకు మారుపేరని చాలా మంది విమర్శించే స్థాయికి దిగజారింది. ఇస్లామో ఫోబిక్ సినిమాలు తీస్తే కాసుల వర్షం కురుస్తుందని, మత తత్వశక్తుల ప్రాబల్యం పెరిగిన వాతావరణంలో ఈ సిని మాలు రాజకీయంగా కూడా తమకు ప్రయోజనాలిస్తాయని, ఇలాంటి సినిమాలు తీస్తే అధికారంలో ఉన్న పెద్దల ఆశిస్సులు లభిస్తాయని బహుశా నిర్మాతలు పోటీ పడి తీస్తు న్నట్లు కనిపిస్తోంది. ఇలాంటి చాలా సినిమాలు విడుద లయ్యాయి. సినిమా ముసుగులో మత విద్వేషాన్ని రేకెత్తించే కథనాలు వివాదాలకు కారణమయ్యాయి.

ఈ కోవకు చెందిన తాజా ముస్లిం విద్వేష చిత్రం "హమారే బారా". ఒక ముస్లిం మహిళ తన తల్లి గర్భం ప్రమాదకర మైంది కాబట్టి గర్భస్రావం చేయించడానికి తన తండ్రిని కోర్టుకు లాగిన కేసు ఈ కథలో ఉంది.

'హమారే బారా' చిత్రం కోర్టుకు వెళ్ళింది. సుప్రీంకోర్టు వివాదాస్పద చిత్రం విడుదలను నిలిపివేసింది. హైకోర్టు ఆదేశాల మేరకు చిత్రనిర్మాతలు ట్రైలర్ నుండి వివాదాస్పద సంభాషణలను తొలగించారని వాదనలు ఉన్నప్పటికీ, న్యాయమూర్తులు విక్రమ్‌నాథ్, సందీప్ మెహతాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ వాదనను తోసిపుచ్చింది.

అంతకు ముందు హైకోర్టులో ఈ సినిమా కేసు విచారణ జరిగింది. మొదట స్టే ఆర్డర్ ఇచ్చిన హైకోర్టు ఒక రోజు తర్వాత చిత్ర విడుదలపై ఉన్న నిషేధాన్ని హైకోర్టు ఎత్తి వేసింది.

ట్రైలర్ చూస్తే, హమారే బారా ముస్లిం మహిళలు ఇంట్లో ఖైదీలుగా పడి ఉంటారన్నట్లు చూపించింది. ముస్లిం పురుషులు లైంగిక హింసకు పాల్పడే విలన్లుగా చూపించారు. సినిమా ట్రైలర్ చూసిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు అభ్యంతరకరమైన సంభాషణలు ఉన్నాయన్నారు.

ఒకప్పుడు ప్రముఖ టెలివిజన్ షో "అంత్యాక్షరి" కి వ్యాఖ్యాతగా వ్యవహరించిన అన్ను కపూర్ ఇందులో నటించాడు. ఈ సినిమా ట్రైలర్ విడుదలైంది. సమాజంలో ఒక సముదాయం పట్ల ద్వేషాన్ని పెంచే చిత్రం అని చాలా మంది విశ్లేషించారు. బాలీవుడ్ వినోదాత్మకంగా, సామాజిక చిత్రాలను, విలువలతో కూడిన చిత్రాలను రూపొందించిన రోజులు పోయాయి. ఇప్పుడు ఒక సముదాయంపై దాడి చేయడానికి మాత్రమే చాలా సినిమాలు తయారవుతున్నాయి. 'ది కాశ్మీర్ ఫైల్స్' (2022) నుండి 'ది కేరళ స్టోరీ' (2023) వరకు విద్వేషమే ప్రధానంగా ఈ సినిమాలు తయారవు తున్నాయి. నిజానికి అన్నూకపూర్ ఇంతకు ముందు నటించిన డ్రీమ్ గర్ల్ సినిమా 2019లో వచ్చింది. ఆ సినిమాలో కూడా అన్నూ కపూర్ ముసలి వయసులో రెండవ పెళ్ళి కోసం ముస్లిముగా మారడం గురించిన సీన్లు ఒక ప్రత్యేక సముదాయాన్ని లక్ష్యంగా చేసుకున్న సీన్లే. అయితే ఆ సినిమాలో హాస్యం కోసం చేసిన ప్రయోగంగా చాలా మంది ఈ థర్డ్ గ్రేడ్ హాస్యాన్ని భరించారు. కాని కశ్మీర్ ఫైల్స్, కేరళ స్టోరీ వంటి సినిమాలు అవాస్తవాలు, వక్రీకరణలతో పూర్తి స్థాయి ఇస్లామోఫోబిక్ సినిమాలుగా వచ్చాయి. ప్రాపగాండ సినిమాకు రాజకీయ ఆశీస్సులు ఎప్పుడు ఉంటాయి. ఉత్తర కొరియా, రష్యా నాజీ కాలం నాటి జర్మనీల్లో ఈ సినిమాలు ఎలా ప్రభుత్వ ప్రోత్సాహం పొందుతాయో మనం చూశాం. 'దేడ్ ఇష్కియా', 'ఏ వతన్ మేరే వతన్' వంటి చిత్రాలకు ప్రసిద్ధి చెందిన రచయిత, నిర్మాత దరాబ్ ఫారూకీ హమారే బారా చిత్రం గురించి ది సిటిజన్ వార్తాసంస్థతో మాట్లాడుతూ, ఈ చిత్రం తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తుందని, కనీస పరిశోధన కూడా సబ్జక్టుపై చేయలేదన్నది స్పష్టంగా తెలుస్తుందని అన్నారు. లేకపోవడం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. "అసలు వాళ్ళు ఏం తీశారో కూడా వాళ్ళకు తెలియదు, ఇస్లాం గురించి చెప్పగల ఏ ధర్మవేత్తను సంప్రదించినా చాలా వివరాలు వారికి తెలిసి ఉండేవి. ఈ చిత్రం కేవలం ముస్లింలను ఆటవికులుగా చిత్రించే ఆలోచనతో తీసింది మాత్రమే" అని ఫరూకీ అన్నారు. ముస్లింలను రాక్షసులుగా చిత్రీకరించే ఆలోచనతోనే ఇలాంటి ప్రాపగాండ సినిమాలు తీస్తారని చెప్పాడు.

"ఈ చిత్రం పేరు, ట్రైలర్, ముస్లిం మహిళలను చూపించిన తీరు, ఇస్లామోఫోబియా తప్ప మరొకటి కాదు. బుల్లీ బాయి యాప్, సుల్లీ డీల్స్ తర్వాత ఇప్పుడు ఈ చిత్రం.. వరుసగా దేశంలో ఇస్లామోఫోబియా నిరంతర ప్రచార వరద కొనసాగుతోందని"" ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సభ్యురాలు డాక్టర్ ఆస్మా జెహ్రా అన్నారు.

National Crime Records Bureau ప్రకారం బాలికలు, మహిళలపై నేరాలు నాలుగు రెట్లు పెరిగాయి. అందులో 14 శాతం మంది బాధితులు ముస్లిం మహిళలు. మిగిలిన 86 శాతానికి పైగా మహిళలపై జరుగుతున్న నేరాలు ఘోరాలు చాలా ఉన్నాయని ఆమె చెప్పారు.

'కాశ్మీర్ ఫైల్స్' 'కేరళ స్టోరీ' సినిమాలే కాదు ఇలాంటి ఇస్లామోఫోబిక్ ప్రాపగండ సినిమాలు చాలానే విడుదలయ్యాయి. స్వతంత్ర వీర్ సావర్కర్, జహంగీర్ నేషనల్ యూనివర్శిటీ, ఆర్టికల్ 370, మై అటల్ హూన్ వంటి ఇటీవల విడుదలైన సినిమాల్లో ఇతివృత్తాలు ముస్లిములను కించపరిచేవి, వారిని విలన్లుగా చూపించే చిత్రాలే. 'కాశ్మీర్ ఫైల్స్, కేరళ స్టోరీ' ఇప్పుడు 'హమారే బారా' ఈ మూడు చిత్రాలు మాత్రమే ప్రజలకు తెలుసు. 'హమారే బారా' చిత్రం ముస్లింలు అధికసంతానం కలిగి ఉంటారని చెప్పే సినిమా. ఖుర్ఆన్ ప్రకారం తల్లి ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా ఎక్కువ మంది పిల్లలు కనడమే ప్రధానంగా ముస్లిములు ఆలోచిస్తారని చెప్పే సినిమా. ఎన్నికల ప్రచారంలో స్వయంగా మోడీ అధిక సంతానం కలిగిన వారంటూ ముస్లిములపై చేసిన దాడిని కూడా గుర్తు చేసుకుంటే ఎవరి కోసం ఈ సినిమా తీశారో అర్థమవుతుంది.

ఎన్నికలు జరుగుతున్నప్పుడు ప్రధానమంత్రికి ఎకనామిక్ అడ్వైజరీ కౌన్సిల్ విడుదల చేసిన వర్కింగ్ పేపర్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఈ నివేదిక ప్రకారం, దేశ జనాభాలో భారతీయ ముస్లిం జనాభా 1950 నుండి 43 శాతానికి పైగా పెరిగిపోయింది. ఒకవైపు లోక్‌సభ ఎన్నికలు జరుగుతుంటే మధ్యలో ఈ నివేదిక విడుదల చేసారు.

ఈ నివేదికలో గణాంకాలను తిమ్మి బమ్మి చేసి భ్రమాత్మకంగా చూపిస్తున్నారన్న వివరణలు, విశ్లేషణలు అప్పట్లోనే చాలా వచ్చాయి. 2022లో విడుదల చేసిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 ప్రకారం సంతానోత్పత్తి రేటు గత రెండు దశాబ్దాలుగా అన్ని మత వర్గాలలో బాగా క్షీణించింది. పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా కూడా “ముస్లింల దశాబ్ది వృద్ధి రేటు 1981-1991లో 32.9% నుండి 2001-2011లో 24.6%కి తగ్గిందని పేర్కొంది. ఇదే కాలంలో హిందువుల వృద్ధి రేటు 22.7 శాతం నుంచి 16.8 శాతానికి పడిపోయింది. గణాంకాల కోణం నుంచి చూస్తే హిందువుల అభివృద్ధి రేటులో తగ్గుదల 5.9 అయితే ముస్లిములలో జనాభా వృద్ధిరేటు తగ్గుదల 8.3. అంటే హిందూ జనాభా కన్నా వేగంగా ముస్లిముల జనాభా తగ్గుతోంది. ఇది వాస్తవమైతే ముస్లిం జనాభా అరవైశాతం పెరిగిపోయిందన్న ప్రచారానికి అర్థమేమిటి?

2011 జనాభా లెక్కల ప్రకారం ముస్లింల జనాభా 17.22 కోట్లు, అప్పుడు భారత దేశంలో మొత్తం 121.08 కోట్ల జనాభాలో 14.2%. కాగా మునుపటి జనాభా లెక్కల (2001)లో ముస్లింల జనాభా 13.81 కోట్లు, అంటే మొత్తం భారతదేశ జనాభాలో 13.43%. 2001-2011 మధ్య ముస్లిం జనాభా 24.69% పెరిగింది. ఇది భారతదేశ చరిత్రలో ముస్లింల జనాభాలో అతి తక్కువ పెరుగుదల. 1991 మరియు 2001 మధ్య భారతదేశ ముస్లిం జనాభా 29.49% పెరిగింది. నేషనల్ శాంపిల్ సర్వే 68 ప్రకారం చూస్తే హిందూ కుటుంబం సైజు 4.3 అయితే ముస్లిం కుటుంబం సైజు 5. తేడా చాలా తక్కువ. సిక్కు కుటుంబం సైజు 4.7.

తాజా జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే 2019%-20 (NFHS-5) ప్రకారం అనేక రాష్ట్రాలు జనాభా స్థిరీకరణ దశలోకి వచ్చేశాయి. ఫెర్టిలిటీ రేటు తగ్గుతోంది. ఆర్థిక సర్వే 2018-19 అలాగే 2017 నుండి సాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (SRS) డేటా కూడా భారతదేశ జనాభా వృద్ధి రేటు తగ్గుతున్నట్లు చూపిస్తున్నాయి.

NFHS డేటా ప్రకారం, గత రెండు దశాబ్దాల్లో అన్ని మత సముదాయాలలో ఫెర్టిలిటీ రేటు తగ్గింది. ముఖ్యంగా ముస్లింల కుటుంబం సైజు గణనీయంగా తగ్గింది.

ముస్లింల జనాభా పెరుగుతుందని బడా రాజకీయ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు, మతతత్వ శక్తులు చేస్తున్న ప్రచారం, ప్రాపగాండ సినిమాల హంగామా ఇవన్నీ సామాజికంగా వేసే ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుంది. ఇతర సముదాయాలు ముస్లిముల పట్ల చిన్నచూపు చూడడానికి, కించపరచడానికి ముఖ్యంగా ముస్లిం మహిళలకు పని ప్రదేశాల్లో, స్కూలు, కాలేజీల్లో ప్రతికూల పరిస్థితులు సృష్టించే ప్రచారం. ఇది ముస్లిం మహిళలను ఇంటికే పరిమితం చేసే కుట్ర లాంటి ప్రచారం. పైగా ముస్లిం మహిళల పునరుత్పత్తి హక్కుపై ప్రత్యక్ష దాడి ఇది. ఒక సముదాయాన్ని తప్పుడు ప్రచారంతో అప్రతిష్ఠ పాలు చేయడం, ఒక సముదాయాన్ని విలన్లుగా చిత్రీకరించడం ద్వారా దేశాభివృద్ధిని దెబ్బతీస్తున్నారని ఈ మతతత్వ శక్తులు మరిచిపోతున్నాయి. వివక్ష, పక్షపాతాలు ఎల్లప్పుడు దేశాభివృద్ధికి గొడ్డలిపెట్టుగా మారతాయి. ✤

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

అధ్యాయం -13

36

# వ్రీడా ధన శ్రేష్ఠుడు

ఎస్.ఎమ్. మలిక్

## ఇస్లామ్ విస్తృతి, వారి వైఖరి

ఆ తరువాత కొన్నేళ్లలోనే ఇస్లామ్ తూర్పు పడమరలకు బాగా ప్రాకిపోయింది. కోటాను కోట్ల ప్రజలు ఇస్లామీయ సముదాయంలో ప్రవేశించి తమ జీవితాలను చక్కదిద్దుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. కాని వారిని సక్రమంగా ఇస్లామీయ సుశిక్షణ ద్వారా జ్యోతిర్మయం చేసే సమంజసమయిన ప్రబంధం లేకపోయింది. యూదులు ఈ విషయాన్ని గ్రహించారు. ముస్లిములలో విచ్ఛిత్తికి ఇదే అదునుగా భావించి, యూదుల్లోని ఓ అత్యంత కుత్సిత బుద్ధి గల వ్యక్తి 'అబ్దుల్లా బిన్ సబా' ఇస్లామ్ వ్యతిరేక ఉద్యమానికి నాయకత్వం వహించాడు. అతను యమన్ నుండి మదీనాకు వచ్చి సద్వచనం పఠించి ముస్లిములలో చేరిపోయాడు.

అది మహనీయ ఉస్మాన్(ర) ఖిలాఫత్ కాలం. ఇబ్ను సబా అక్కడి నుండి ఇస్లామీయ రాజ్యంలో అంతర్భాగమయిన ఇరాక్ రాజధాని బస్రా చేరాడు. అక్కడ అతని రహస్య ఉద్యమంలో ఓ దొంగల ముఠా నాయకుడు, 'హకీమ్ బిన్ జుబ్లా' అతనికి తోడయ్యాడు. ముస్లిములు తమ ప్రవక్త(స) పట్ల అమితమయిన ప్రేమ కలిగి ఉంటారన్న విషయం అతనికి బాగా తెలుసు, అందువల్ల ఆ దారినే ముస్లిములలో తప్పుడు ఆలోచనలు రేకెత్తించే ప్రయత్నాలు మొదలు పెట్టాడు.

అతను ఎంతో బాధగా, "నాకు మన సోదరులు ముస్లిముల పట్ల ఎంతో ఆశ్చర్యం కలుగుతుంది, వారు ప్రవక్త ఈసా(అ) అయితే ప్రపంచంలోకి తిరిగి రానున్నారని నమ్ముతారు కాని మన ప్రియతమ ప్రవక్త మహనీయులు(స) తిరిగి రాగలరన్న అంశాన్ని అంగీకరించరు!" అని అంటాడు. మరోసారి, "ఎంత విచిత్రం! మన మధ్య ప్రవక్త మహనీయుల(స) సంతానం ఉండగా మనమేమో ఇతరుల్ని ఖలీఫాగా ఎన్నుకుంటున్నాము." అని పురికొలుపుతాడు. ఇంకొకసారి, "గమనించారా, మన ఖలీఫా గారి బంధు ప్రీతి? ముఖ్య పదవులన్నీ బనూ ఉమయ్య కైవసం అయ్యాయి!" అని అజ్ఞాన కాలపు జాతి దురభిమానాలు రేకెత్తించే ప్రయత్నం చేస్తాడు.

అతని మాటల్లో ప్రవక్త, ఆయన సంతానం పట్ల ప్రేమ, శ్రేయోభిలాష వ్యక్తమవడం చేత, ధర్మం విషయంలో పరిపక్వతకు చేరని సాధారణ జనం, అతని మాటల్ని ఎంతో శ్రద్ధగా వినేవారు, బాగా ప్రభావితులయ్యేవారు. వారిలో క్రమంగా దురభిప్రాయాలు వ్రేళ్ళూన సాగాయి.

గవర్నర్ అబ్దుల్లా బిన్ ఆమిర్‌కు ఈ విషయాలు తెలిసినప్పుడు ఆయన ఇబ్ను సబాను పిలువనంపి విచారించారు. అతను జవాబుగా తాను గ్రంథవహుల్లోని వాడినని, ఇప్పుడు ఇస్లామ్ స్వీకరించి దాని వ్యవస్థ, ఆదేశాలను గురించి అధ్యయనం చేస్తున్నట్లు, ఇక్కడ గవర్నర్ గారి ఛత్రఛాయల్లో గడపడం తనకు ఇష్టమని పలికాడు. దానికి ఆయన, "నీ గురించి నాకు తెలిసినంత వరకు నీ వల్ల ఇరాక్ ప్రజల్లో మార్గవిహీనత ఉపద్రవాలు ఉత్పన్నమయ్యే ప్రమాదముంది, తక్షణం నీవు ఇక్కడి నుండి వెళ్ళిపోవాలి. నేను ఇటువంటి వారిని సహించలేను" అని పురమాయించారు.

ఆ తరువాత అతను కూఫా వెళ్ళనయితే వెళ్ళాడు కాని ఇక్కడి ప్రజల్లో ఉపద్రవ బీజాలు నాటి పోయాడు. అతని గోప్య అనుయాయిగణం ఇక్కడ ఉండిపోయింది. కూఫా ప్రజల బుద్ధి అతని లక్ష్యం కొరకు బాగా అనువుగా పరిణమించింది. ఇక్కడ కూడా అతని ఉద్యమం కొంత ఫలించింది. కాని అక్కడి నుంచి కూడా అతన్ని తరిమి వేయడం జరిగింది. అతను అక్కడి నుండి ఈజిప్టు చేరాడు.

ఈజిప్టులో అతను తన అండర్ గ్రౌండ్ ఉద్యమాన్ని పెద్ద ఎత్తున ఉధృతంగా నడప గలిగాడు. అక్కడ అతను మరో ఎత్తు వేశాడు. ఖిలాఫత్ పట్ల అసంతృప్తిని సృజించడం మొదలెట్టాడు. అతని ఎత్తుగడ ఏమిటంటే, "ప్రపంచంలో వేల మంది ప్రవక్తలు ఆవిర్భవించారు, వారందరికీ వారి వీలునామా ప్రకారం, వారి స్థానంలో ఎన్న దగిన వారున్నారు, అలాగే ప్రవక్త మహనీయులు ముహమ్మద్(స) స్థానంలోనూ ఒకరున్నారు, ఆయనే మహనీయ అలీ(ర). ఇంకా మహనీయ ముహమ్మద్(స) ఏ విధంగా ప్రవక్తలలో చివరి వారో అదే విధంగా మహనీయ అలీ (ర) కూడా ప్రవక్త వీలునామా ప్రకారం, ఆయన స్థానంలో చివరి వారు. ప్రవక్త వీలును పాటించని వారి కన్నా దౌర్జన్యులెవరు?" అని పలికేవాడు.

ఇంకా, 'ప్రవక్త వీలునామా పొందిన వారు(మహనీయ అలీ) ఉండగా మహనీయ ఉస్మాన్(ర) ఖిలాఫత్ పదవికి అర్హులు కార'ని కూడా ప్రోపగాండ చేసేవాడు. పైగా జనుల్ని, "జనులారా! లేవండి, న్యాయం చేకూర్చండి, హక్కు దారులకు హక్కు ఇప్పించండి, లేవండి, ఉద్యమం చేపట్టండి. ఈ ఖలీఫా, ఇతని అధికారులు అందరూ అనర్హులు, దౌర్జన్యపరులు. వీరిని తొలగించండి. మంచిని పెంచడానికి, చెడును త్రెంచడానికి ఇది సరయిన సమయం కాదా?!" అంటూ రహస్య సమావేశాల్లో పురి కొలిపే వాడు. ఈ దుష్ప్రచారానికి ప్రభావితులయి బాగా గట్టి పడిన వారిని ఇతర ప్రాంతాలకు పంపేవాడు. ఫలితంగా ఈజిప్టు నగరాలన్నింటిలో 'సబాయీ' వర్గం రహస్య సంఘాలు ఏర్పడ్డాయి.

ఇరాక్‌లోనూ యూదుల సబాయీ ఉద్యమ కార్యక్రమాలు సాగుతూ ఉండేవి. అక్కడా సబాయీ సంఘ నిర్మాణం జరిగింది. ఓ పథకం ప్రకారం ప్రభుత్వం, దాని యంత్రాంగం పట్ల తప్పుడు ఉదంతాలు సృజించి లేఖల ద్వారా ఈ దుష్ప్రచారం కొనసాగించే వారు. పలు ప్రాంతాల్లో అసంతృప్తిని విస్తృతపరిచే ఈ కార్యక్రమం వల్ల సామాన్య ప్రజలు ప్రభావితులయ్యే వారు. ఈ లేఖలు వినిపించిన ప్రతి చోట విభిన్న స్పందనలు వ్యక్తమయ్యేవి. ఇరాక్ ప్రజలు విని, "దైవానికి కృతజ్ఞతలు, ఆయన కృప వల్ల మా ప్రాంతంలో ఇటువంటి దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడలేదు" అనుకుంటే ఈజిప్టు ప్రజలు విని, "మేము అదృష్టవంతులము, మా పైన ఇరాకీయుల వంటి దౌర్జన్యాలు తారసపడటం లేదు" అనుకునే వారు. ఇలా ఓ ప్రాంతం వారు మరో ప్రాంతంలోని ప్రజల పైన జాలి పడేవారు.

సహచర మాన్యులు(ర) ఖలీఫా వద్దకు వెళ్లి, "అమీరుల్ మూ'మినీన్! మా వద్దకు ఇటువంటి లేఖలు వస్తున్నాయి, మీకు వీటిని గురించి ఏమయినా సమాచారం అందించారా అధికారులు?" అని అడిగారు. ఆయన ఆశ్చర్యంగా "నాకు పలు ప్రాంతాల నుండి అందే సమాచారం ప్రకారం అంతా సవ్యంగానే ఉంది" అన్నారు.

## విచారణ కమిటీ

పై సంభాషణ తరువాత సలహా మండలి సిఫారసు మేరకు విభిన్న ప్రదేశాల పరిస్థితులను గురించి సమాచారం సేకరించేందుకు సమర్థులయిన సహచరుల ఓ కమిటీని నియమించడం జరిగింది. కొందరు సహచరుల్ని వివిధ ప్రాంతాలకు పంపారు. ఈజిప్టుకు వెళ్ళిన మహనీయ అమ్మార్ బిన్ యాసిర్ (ర) తప్ప మిగతా సభ్యులు వచ్చి తమకు ఏ విధమయిన అసంతృప్తి గోచరించ లేదని, ఎటువంటి అశాంతీ లేదని, సమస్త పరిపాలనా వ్యవస్థ సక్రమంగా ఉందని రిపోర్టు ఇచ్చారు. అయితే ఈజిప్టు గవర్నర్ అబ్దుల్లా బిన్ సఅద్ ఖిలాఫత్ కేంద్రానికి పంపిన నివేదిక ప్రకారం, అమ్మార్‌ని అక్కడి అలజడి కారకులయిన వారు, చాకచక్యంగా తమ

మాటకారితనంతో ప్రభావితం చేసి వేశారని, ఆయన ఆ సంఘంలో చేరిపోయారని తెలిసింది.

★★★

## మదీనా, సిరియాలలో పరిస్థితి

సిరియాలో అక్కడి గవర్నర్ మహనీయ ముఆవియా(ర) రాజకీయ దూరదృష్టి, ఉపాయాల వల్ల సబాయీ అండర్ గ్రౌండ్ ఉద్యమం వ్రేళ్ళూనలేక పోయింది. అయినా అబ్దుల్లా బిన్ సబా ఇంకా ఇతర యూదుల వల్ల ఓ సంఘటన జరిగింది. అది ఓ ప్రముఖ సహచర మాన్యుల్ని, మహనీయ ఉస్మాన్(ర)కు వ్యతిరేకంగా రేకెత్తించడంలో సఫలమయింది.

## సబాయీ పన్నుగడ

ఇబ్ను సబా సిరియా వెళ్ళిన రోజుల్లో మహనీయ అబూజర్ గిఫారీ కూడా అక్కడే ఉన్నారు. ఆ మోసకారి యూదుడు కొందరు తన మిత్రులతో కలసి వెళ్లి మాటల సందర్భంలో సిరియా గవర్నర్ మహనీయ ముఆవియాని గురించి అపవాదుగా, 'బైతుల్ మాల్ (ప్రభుత్వ ధనాగారం)ని ఆయన దైవం సొత్తుగా పేర్కొంటున్నారు, నిజానికి అది ముస్లిముల సొత్తు కదా' అంటూ 'ఆ విధంగా ఆయన దాన్ని ముస్లిములకు ఇవ్వకుండా తన అధీనంలో ఉంచుకోదలిచార'ని చెప్పాడు. ఇది విన్న మహనీయ అబూజర్(ర) కలత చెందారు.

ఆయన వెంటనే సరాసరి గవర్నర్ ముఆవియా వద్దకు వెళ్లి ఆయన్ని నిలదీశారు, "నీవు ముస్లిముల సొత్తును దైవం సొత్తు అని అంటున్నావట, ఏమిటా విషయం?" అని. ఆయన దానికి సమాధానంగా, "అయ్యా! విశ్వంలో ఉన్న సమస్తం దైవానికి చెందినదే కదా, ఈ సొత్తు కూడా ఆయనకే చెందినది. అందులో సందేహం ఏముంది?" అన్నారు. ఆయన స్పందిస్తూ, "అలా చెప్ప కూడదు, అది ముస్లిములకు చెందిన సొత్తు" అని వాదించారు. దీనికి మహనీయ ముఆవియా, "అయ్యా, నేను మటుకు ఇది దైవం సొత్తు కాదని మాత్రం చెప్పలేను" అని బదులిచ్చారు.

ఆ తరువాత ఇబ్ను సబా మహనీయ అబూ దర్దాని కలిశాడు. ఆయన ఇతని మాటలు విన్నంతనే గ్రహించారు, వెంటనే, "నా అభిప్రాయంలో నీవు ఇస్లామ్ విరోధివి, యూదుడివి అంటూ తరిమి వేశారు. తిరిగి అతడు ఉబాద బిన్ సామిత్ ని కలిశాడు. ఆయన అతని మాటల తీరుకు విపరీతంగా ఆగ్రహించారు. అతన్ని పట్టుకుని నేరుగా మహనీయ ముఆవియా(ర) వద్దకు తీసుకు వెళ్లి, "ఇతనే మహనీయ అబూజర్‌ని ప్రేరేపించి మీతో వాదనకు పంపినవాడు" అని తెలిపారు.

వాస్తవానికి సబాయీ యూదు ఉద్యమం ఎంతో చాకచక్యంగా సాగింది. మదీనా ప్రజల్లోనూ అనుమానపు బీజాలు నాటి వేసింది. సాధారణ జనుల్లో అసహనం చోటు చేసుకుంది. ఒకరిద్దరు ఖలీఫా పట్ల దురుసుగానూ మాటలాడారు. కాని మహనీయ ఉస్మాన్ తన వినమ్ర ప్రవృత్తి రీత్యా సహనం, సంయమనం పాటించారు.

## గవర్నర్ల సమావేశం

ఈ వింతయిన రహస్యమయ సమాచార పరంపర ఆగక పోయే సరికి ఖలీఫా మహనీయ ఉస్మాన్(ర) పలు ప్రాంతాల్లో ఉన్న నాయకులను, హజ్జ్ సందర్భంలో వచ్చి తనను కలవ వలసిందని ఆదేశించారు.

వారు వచ్చినప్పుడు ఖిలాఫత్ పరిధుల్లో ప్రాకి పోయిన ఈ ఉపద్రవం ఏమిటని, ముస్లిముల్లో దీన్ని వ్యాపింప జేస్తున్న వారెవరని అడిగారు. ఆ నాయకులు, తాము కూడా అటువంటి పుకార్లు విన్నాము కాని వాటి ఆధారాలు దొరకడం లేదని, నిరాధారంగా ఎవరినీ నిర్బంధం లోకి తీసుకోవడం సాధ్యం కాదని తమ అశక్తత వెల్లడించారు.

సయీద్ బిన్ ఆస్, "ఈ పుకార్లు రహస్యంగా రూపొందించి సాదా సీదా జనుల్లో వ్యాపింపజేస్తున్నారు. తన్మూలంగా అమీరుల్ మూ'మినీన్, పాలనాధికారుల గౌరవం, నిజాయితీ, సామర్థ్యాల పట్ల అనుమానాలు సృష్టించాలన్నది ఆశయంగా అగుపడుతోంది. ఇటువంటి వారికి నా అభిప్రాయంలో మరణ దండన విధించ వలసిందే" అన్నారు.

అబ్దుల్లా బిన్ సఅద్ దీనితో ఏకీభవించారు. ముఆవియా (ర), "నా ప్రాంతంలో మాత్రం ఇటువంటి అలజడులు లేవు. ఏ ప్రాంతాల్లోనయితే ఈ ఉపద్రవం నెలకొన్నదో ఆ ప్రాంతాల గవర్నర్ల అభిప్రాయం చాలా మటుకు సరయినదయి ఉంటుంది గనక నేను వారితో ఏకీభవిస్తాను. ఉపద్రవ జనకుల పట్ల గుణపాఠం గరిపే విధంగా కఠినంగా వ్యవహరించడం అనివార్యం" అన్నారు.

ఆ పైన మహనీయ అమ్ర్ బిన్ ఆస్ (ర), "అమీరుల్ మూ'మినీన్! నా దృష్టిలో మీ పక్షాన చాలా అలుసు ఇవ్వడం

జరుగుతోంది. వ్యక్తిగత స్వేచ్ఛ అన్నది, ఓ మేరకే సరయినది. అది సముదాయంలో విచ్ఛిత్తి, అరాచకం లేవదీసేదయితే దాన్ని నిర్దాక్షిణ్యంగా అణగద్రొక్కవలసిందే. కొందరు ఇస్లామ్ విరోధులు గప్‌చుప్‌గా చీకట్లల్లో గోప్యంగా తమ వినాశకర కార్యకలాపాలు సాగిస్తూ ఉంటే వారిని వెతకడం, ఏరివేసి సంహరించడం జరక్క పోతే ఏమవుతుంది? మహనీయ ఉమర్(ర) కాలంలో ఏ తలబిరుసు గలవాడయినా ఇలా వ్యవహరిస్తే వాడి పరిస్థితి చూడదగిందిగా పరిణమించేది.'' అని వెల్లడించారు.

అప్పుడు మహనీయ ఉస్మాన్(ర) తెలిపారు, ''మిత్రులారా! ఈ ఉపద్రవం దాని శిఖరానికి చేరుతుంది. దాని తలుపు తెరుచుకోనుంది. నేను దాని అపరాధిని కాను, (ఇన్‌షా అల్లాహ్). దాని విషయంలో ఎటువంటి బాధ్యతనయినా నా నెత్తిన వేసుకునేందుకు భీతిల్లుతున్నాను. ఇంతకూ నేను జనుల కొరకు మేలునే తప్ప మరేమీ చేయలేదు. ఒకటి అనిపిస్తోంది, ఇది దైవప్రవక్త(స) నాకు తెలిపిన మహా ఉపద్రవానికి తొలి ఘట్టమేమో! దాని విషయంలో ఆయన నాకు సహనం వహించ వలసిందని ఉపదేశించారు కూడా!!''

ఆ నాయకుల నందరినీ సాగనంపడం జరిగింది. సలహా మండలి కూడా నిష్క్రమించింది. వెళ్ళే ముందు మహనీయ ముఆవియా(ర), ''ఈ ఉపద్రవం ఏ విధంగా తేలుతుందో, మీరు నా వెంట సిరియాకు పదండి,'' అని అర్థించారు. అయితే మహనీయ ఉస్మాన్(ర) మాత్రం తొణకకుండా నేను ఎట్టి పరిస్థితిలోనూ ప్రవక్తశ్రీ సాన్నిధ్యం (మదీనా) వదలలేను అన్నారు. ఆయన రక్షణకు సిరియా నుంచి ఓ సైనిక దళం పంపుతానని ఆయన చెప్పినా, నగర వాసులకు ఇబ్బంది కలుగుతుందని అంగీకరించ లేదు. తాను దేవుని సమ్మతికే తన అభీష్టాన్ని అంకితం చేసుకున్నానని గట్టిగా చెప్పారు.

## సబాయీ సంఘం

బస్రా, కూఫా, ఈజిప్టులోని సబాయీ వర్గాలు తమ తమ ప్రతినిధి బృందాలను ఏర్పాటు చేసుకుని బయలుదేరాయి. వీరంతా మదీనాకు దగ్గర ప్రాంతంలో చేరి నిలిచి పోయారు. ఇది తెలిసిన ఖలీఫా మహనీయ ఉస్మాన్(ర) ఇద్దరు వ్యక్తుల్ని పంపి ఈ రాకకు ఉద్దేశం తెలుసుకున్నారు. వారు వచ్చి, ''వారు మీ తప్పిదాలను, అధికారాల దుర్వినియోగాన్ని ఎత్తి చూపి మీ రాజీనామా కోరడానికి వచ్చారట, మీరు తిరస్కరిస్తే మిమ్మల్ని సంహరిస్తారట'' అని తెలిపారు.

ఆయన ఇది విని, అటు సబాయీలను ఇటు సహచర మాన్యుల్ని పిలిపించి సమావేశం ఒకటి ఏర్పాటు చేశారు. అందులో వారు మోపిన అవాస్తవ అభియోగాలన్నీ విన్నారు. ప్రవక్త సహచర మాన్యులు ఇదంతా చూసి ఆందోళనా చెందారు, ఆగ్రహోదగ్రులూ అయ్యారు. వారు ముక్త కంఠంతో అమీరుల్ మూ'మినీన్‌ని అర్థించారు, ''వీరి నందరిని పట్టి సంహరించడానికి ఆనతి నివ్వండి'' అని. ఆ తరువాత ఆయన అలా కాదని, వారి ఒక్కొక్క అభ్యంతరానికి సమంజసంగా, ఆధార సహితంగా, సంతృప్తికరంగా సమాధానం ఇచ్చారు. ✤


సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.

# విద్యాజ్ఞానాల గొప్పతనం

- నసీరా బేగం

**ఒకసారి** పిస్తా బాదాములతో తయారు చేయబడిన పాయసాన్ని ఖలీఫా హారూన్ రషీద్‌కు సమర్పించటం జరిగింది. ఆ పాయసం ఆయనకు ఎంతగానో నచ్చింది. వెంటనే ఆయనకు విద్వాంసులు, ఫిఖా శాస్త్రవేత్త, ఖాజీ అయిన అబూ యూసుఫ్ యాకూబ్ బిన్ ఇబ్రాహీమ్ జ్ఞాపకమొచ్చారు. ఈ పాయసాన్ని ఆయనకు రుచి చూపించాలని ఆయన ఉవ్విళ్ళూరారు. ఖలీఫా హారూన్‌రషీద్ విద్వాంసులను ఎంతగానో గౌరవించేవారు. తమ కుమా రులను కూడా గురువులను గౌరవించాలని ఆదేశించేవారు. కనుకనే పాదుషా కుమారులై ఉండి కూడా గురువుకు చెప్పులు తొడిగించ టానికి కూడా వెనుకాడే వారు కాదు. హారూన్ రషీద్ కూడా విద్వాంసులను అత్యధికంగా తమ రాజభవనంలో ఆతిథ్య మిచ్చేవారు. స్వయంగా దగ్గరుండి తినిపించేవారు. అంతేకాదు తమ స్వహస్తాలతో నీళ్ళు పోసి వారి చేతులను కడిగించేవారు.

అయితే పిస్తా బాదాములతో తయారు చేయబడిన ఆ పాయసాన్ని తినిపించటానికి ఒక రోజు అబూ యూసుఫ్ యాకూబ్ బిన్ ఇబ్రాహీమ్ గారిని ఖలీఫా హారూన్ రషీద్ ఆహ్వానించారు. ఖలీఫా ఆహ్వానాన్ని ఆయన స్వీకరించి రాజ భవనానికి చేరుకున్నారు. ఖలీఫా హారూన్ రషీద్ తన స్వహస్తాలతో ఆ పాయసాన్ని ఆయనకు వడ్డించారు. ఆ పాయసాన్ని ఆయన గారు సేవించారు. దాని రుచి ఆయనకు బాగా బాగా నచ్చింది. దానికి ఖలీఫా హారూన్ రషీద్ చాలా సంతోషించారు; ఇలా అన్నారు : ఓ ఖాజీ గారూ! ఇది పిస్తా, బాదములతో ప్రత్యేకంగా నా కోసం తయారు చేయబడిన వంటకం. ఇది నాకు ఎంతగానో నచ్చింది. మీకూ నచ్చింది కాబట్టి వారంలో ఒకసారి నా కోసం, ప్రతిరోజు మీ కోసం తయారు చేయిస్తాను. మీరు దాన్ని తప్పకుండా తీసుకోండి.

ఖలీఫా హారూన్ రషీద్ గారి ఈ మాటను విన్న ఖాజీ అబూ యూసుఫ్ బిన్ ఇబ్రాహీమ్ పకపకమని నవ్వారు. ఆయన గారు ఈ విధంగా నవ్వటాన్ని చూసిన ఖలీఫా ఆశ్చర్యచకితులై ఏమిటి ఇలా నవ్వుతున్నారు! కారణమేమిటి? అని అడిగారు. దానికి ఆయన ఈ పాయసం బాదాము పిస్తాలతో తయారు చేయబడినది అని విని నాకు నా గురువు గారు చెప్పిన మాటలు, ధైర్యవచనాలు జ్ఞాపక మొచ్చాయి. నా గురించి ఆయన చెప్పిన మాటలను అల్లాహ్ నిజమైనవిగా చేశాడు. దానికి నేను సంతోషిస్తు న్నాను అని చెప్పి ఖాజీ గారు తన జీవిత గాధను ఇలా వివరించారు: విషయమేమిటంటే బాల్యంలోనే నా తండ్రి గారు మరణించారు. నేను అనాధుడినై పోయాను. ఇల్లు గడవటం కష్టమైపోయింది, పస్తులు గడపవలసిన పరిస్థితులు ఎదురయ్యాయి. ఇటువంటి పరిస్థితుల్లో నా తల్లి గారు ఒక చాకలి వద్దకు కూలీపని కోసం చేర్పించారు. నేను ప్రతిరోజు పని చేయటం కోసం అతని వద్దకు వెళ్ళేవాణ్ణి. మార్గమధ్యలో ఇమామ్ అబూహనీఫా(రజి) గారి వద్ద కొంతమంది విద్యార్థులు విద్యనభ్యసిస్తూ ఉండటాన్ని నేను చూసేవాణ్ణి. ఈ దృశ్యం నాకు అత్యంత మనోహరంగా అనిపించేది. ఆ దృశ్యానికి నేను ఆకర్షితుడినయ్యాను. రోజూ కొద్దిసేపు అక్కడ నిలబడి ఆ దృశ్యాన్ని చూసేవాణ్ణి. ఆ తరువాత అప్పుడప్పుడూ వారితోపాటు కొద్దిసేపు కూర్చొని ఇమామ్‌గారి బోధనలను ఆలకించేవాడిని. ఈ క్రమంలో పని చెయ్యటానికి వెళ్ళే వాడిని కాదు. దాని కారణంగా కూలీ డబ్బులు లభించేవికావు. మళ్ళీ పస్తులు గడపవలసిన పరిస్థితులు ఎదురయ్యేవి. నేను రోజూ ఇమామ్ గారి తరగతికి హాజరయ్యే వాణ్ణి. కొద్దిసేపటికి నా తల్లిగారు అక్కడికి వచ్చే వారు. నాకు నచ్చజెప్పి పనికి పంపించేవారు. ప్రతిరోజూ ఇలానే జరుగుతూ ఉండేది. ఇమామ్ గారు కూడా ఈ విషయాన్ని గమనించేవారు. ఒకరోజు అమ్మా! నీ కొడుకు చదువులో ఆసక్తి చూపిస్తున్నాడు. ఇది చాలా మంచి విషయం అతడిని చదవనివ్వు అని తల్లి గారిని కోరారు. ఇమామ్ గారు దయచేసి మా అబ్బాయిని పని చెయ్యటం కోసం పంపించండి. లేకపోతే మేం పస్తులు ఉండవలసి వస్తుంది అని నా తల్లిగారు ఆయన్ని కోరారు. చివరకు నేను తల్లితోపాటు బయలుదేరి చాకలి వద్దకు పనికి వెళ్ళిపోయాను. రోజంతా పనిచేసి డబ్బులు తీసుకొని వచ్చి మా అమ్మగారికి ఇచ్చాను. రెండో రోజు పని చెయ్యటానికి వెళ్తున్నానని చెప్పి మళ్ళీ ఇమామ్ గారి వద్దకు వెళ్ళి తరగతిలో కూర్చున్నాను. ఇమామ్ గారు నన్ను తన దగ్గరకు పిలుచుకుని నువ్వు పనిచేస్తే నీకు లభించే డబ్బులు నేను ఇస్తాను. నీవు రోజూ నా వద్దకు

వచ్చి చదువు నేర్చుకో అని అన్నారు. ఇమామ్ గారి నోట ఈ మాటలు విన్న నేను సంతోషంతో ఉబ్బితబ్బిబై పోయాను. ఇక రోజూ ఇమామ్ గారి తరగతికి వచ్చి చదువు నేర్చుకోసాగాను. నేను కొన్ని రోజులపాటు పనికి రాకపోవటాన్ని గమనించిన ఆ చాకలి మా ఇంటికి చేరుకుని నా తల్లి గారితో విషయం వివరించాడు. నా తల్లి గారు ఆందోళనకు గురై మళ్ళీ ఇమామ్ గారి వద్దకు వచ్చి విషయాన్ని వివరించారు. దానికి ఇమామ్ గారు ఇలా అన్నారు; అమ్మా! మీ అబ్బాయిని చదువుకోనివ్వు. డబ్బులు నేను ఇస్తాను. ఇన్షాఅల్లాహ్! నీ కొడుకు చదివి చాలా గొప్పవాడవుతాడు. అతని విద్య శుభాల ద్వారా మీరు పిస్తా, బాదాములతో తయారుచేసిన పాయసాన్ని సేవిస్తారు. ఆయన గారి మాటలు విన్న నా తల్లిగారు నన్ను చదువుకోవటానికైతే అనుమతినిచ్చారు. కాని పేదవాళ్ళమైన మనం ఎక్కడ? పిస్తా బాదాముల పాయసమెక్కడ? అని ఆలోచించసాగారు. చివరకు నేను ఇమామ్ గారు ఇచ్చే భత్యం ద్వారా చదువుకుని ఇక్కడకు చేరాను. గౌరవప్రదంగా మీ చేతులతో పిస్తా బాదాముల పాయసాన్ని సేవించాను. మా గురువు గారి మాటలు అక్షరాల నిజమయ్యాయి అని సంతోషిస్తున్నాను.

హజ్రత్ ఇమామ్ అబూ హనీఫా(రజి) పేద బాలుడైన అబూ యూసుఫ్ బిన్ ఇబ్రాహీమ్‌లో ఉన్న ప్రతిభా పాటవాలను గుర్తించి ప్రత్యేక శ్రద్ధను కనబరిచారు. చక్కని శిక్షణ గరిపారు; ఉన్నతమైన విద్యను నేర్పారు; ఎన్నో నైతిక విలువలను బోధించారు. అవన్నీ నేర్చుకున్న ఆ బాలుడు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు స్వీకరించి చక్కగా నెరవేర్చారు. ఇమామ్ అబూ హనీఫా(ర)గారు తన శిష్యునికి నేర్పిన కొన్ని నైతిక విలువలు ఇవి:

1) ప్రజలతో అనవసరంగా మాట్లాడకు. ఒకవేళ వారే స్వయంగా ఏ విషయం గురించైనా ప్రశ్నిస్తే దానికి తప్పకుండా సమాధానం ఇవ్వు.

2) తోటి యువకులతో ముచ్చట్లలో సమయాన్ని వృధా చేయకు. అటువంటి ముచ్చట్లు ఘర్షణలకు దారి తీస్తాయి. ఇంకా అనవసరంగా బజారుల్లో సంచరించకు.

3) అత్యధికంగా నవ్వకు. అధికంగా నవ్వటం వల్ల హృదయం మృతి చెందుతుంది.

4) దిక్కులు చూస్తూ నడవకు. నేలపై దృష్టి పెట్టి నడువు.

5) లేమికి గురైనట్లయితే ఎవరి ముందు పేదరికాన్ని గురించి ప్రస్తావించకు. హుందాతనాన్ని ప్రదర్శించు.

6) లోభత్వానికి గురికాకు; అత్యాశను దరిచేరనీయకు.

7) ధర్మసమ్మతమైన విషయాలలో ఖర్చు చెయ్యటానికి వెనుకాడకు.

8) ధైర్య సాహసాలు గల వ్యక్తిగా రూపొందు. ఎందుకంటే అధైర్యవంతుడైన వ్యక్తికి ప్రజల దృష్టిలో ఎలాంటి గౌరవమూ ఉండదు.

9) ఎవరైనా నిన్ను ఏ విషయంలోనైనా సలహా అడిగితే దైవ సంతోషం కోసం మంచి సలహానివ్వు.

10) ప్రజల రహస్యాలు బహిర్గతం చెయ్యకు. ఆ రహస్యం వల్ల ఎదుటి వారికి నష్టం కలిగే పరిస్థితి ఉన్నప్పుడు.

11) మహారాజులు, ధనవంతులు అయిన వారి ఇంటి పక్కన, నీవు ఇల్లు కట్టుకోకు.

12) ప్రతి నెల కొన్ని రోజులపాటు ఉపవాస వ్రతాన్ని పాటించు. నిన్ను చూసి ఇతరులు కూడా ఉపవాసవ్రతాలను పాటిస్తారు.

13) నమాజులు చేసిన తరువాత అల్లాహ్ నామస్మరణ కోసం, ఖుర్ఆన్ గ్రంథ పారాయణం కోసం ప్రత్యేకంగా సమయాన్ని కేటాయించు.

14) ప్రజలలో ఉన్నప్పుడు అత్యధికంగా అల్లాహ్‌ను గురించి ప్రస్తావిస్తూ ఉండు. నిన్ను చూసి ప్రజలు కూడా అల్లాహ్‌ను స్మరిస్తారు; దాని ప్రతిఫలం నీకూ లభిస్తుంది.

15) ప్రజలతో సంభాషించేటప్పుడు నోటిని పెద్దగా విప్పి మాట్లాడకు, కంఠస్వరాన్ని అత్యధికంగా పెంచకు.

16) ప్రజల పట్ల జాగ్రత్తగా మసలుకో. ప్రజలలో ఉన్నప్పుడు అల్లాహ్‌తో ఎలా భయపడతావో, ఒంటరిగా ఉన్నప్పుడు కూడా అల్లాహ్‌తో అలాగే భయపడు.

17) ప్రజలు నడిచే మార్గాలపై ఏనాడూ కూర్చోకు. అత్యవసరమైన పరిస్థితుల్లో కూర్చోవలసి వచ్చినప్పుడు మస్జిదులోకి వెళ్ళి కూర్చో.

18) బజారుల్లో కూర్చొని బహిరంగంగా తినకు. మస్జిద్‌ల్లోనూ తినకూడదు.

19) సాధారణ ప్రజలు చేసే ఆరాధనలనే చేసి ఊరుకోకు. అత్యధికంగా ఆరాధనలు చెయ్యి. లేకపోయినట్లయితే నీకూ వారికీ మధ్య తేడా ఏమీ ఉండదు.

20) ఏ రాజు అయినా నీకు హోదా ఇవ్వదలిచినప్పుడు, నీకున్న జ్ఞానం కారణంగా నీకు ఆ హోదా ఇస్తున్నట్లు నమ్మకం ఏర్పడనంతవరకు నీవు దాన్ని స్వీకరించకు.



# అరాచకాలకు అంతం లేదా?

**కేరళ**లో భర్త మరణించిన ముస్లిం మహిళ జీనత్‌కు ముగ్గురు పిల్లలు ఉన్నారని, అందువల్ల ఆమె తన పెద్ద కొడుకును తన సొంత ఇంట్లోనే వివాహం చేసుకుందని పేర్కొంటూ అంధ భక్తులు, బీజేపీ ఐటి సెల్ కార్యకర్తలు ఒక చిత్రాన్ని సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ముస్లిములను, ఇస్లామును అప్రతిష్ఠ పాలు చేసే నీచాతినీచమైన చర్యల్లో ఇది ఒకటి. శ్వేతా శ్రీవాస్తవ అనే ఎక్స్ ఎక్కౌంటు షేర్ చేసిన ఫోటో ఇది. ప్రధాని నరేంద్ర మోడీ స్వయంగా ఫాలో చేస్తున్న ఎక్కౌంట్ ఇది. కాబట్టి బీజేపీతో ఉన్న సంబంధం అర్థమైపోవాలి. ఆల్ట్ న్యూస్‌కు చెందిన ముహమ్మద్ జుబైర్ ఈ మొత్తం వ్యవహారం చిట్టా విప్పారు. చిత్రంలో కనిపించే మహిళ, పూలమాల ధరించిన యువకుని తల్లి. ఆ అబ్బాయి దివ్య ఖుర్‌ఆన్ పారాయణం పూర్తి చేసిన సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమం ఇది. ప్రధాని ఫాలో అయ్యే బీజేపీ ఐటీ సెల్ ఇలాంటి తప్పుడు ప్రచారాలు ఇప్పటికి వేలాది సార్లు చేసింది. కొన్నిసార్లు ఒక సినిమా సన్నివేశాన్ని కత్తిరించి, దాని ఆధారంగా ముస్లింలపై దాడి చేయడం, కొన్నిసార్లు మరొక దేశం వీడియోను చూపించి ముస్లిములతో పాటు బీజేపేతర ప్రభుత్వాలున్న కేరళ, పశ్చిమ బెంగాల్‌లోని పాలక పక్షాలను, ప్రతిపక్ష పార్టీలను లక్ష్యంగా చేసుకోవడం జరుగుతూ వస్తూనే ఉంది.

ఇటీవల టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా గురించి ఇలాంటి అబద్ధాలు ప్రచారం చేసారు. తన ఆరోగ్య రహస్యం ఏమిటని అడిగిన ప్రశ్నకు మహువా కోడిగుడ్లు ఇంగ్లీషులో ఎగ్స్ అని జవాబిస్తే దాన్ని ఈ మతతత్వ గుండాలు సెక్స్ అని మార్చి ప్రచారం చేశారు. వారణాసిలో బెనారస్ హిందూ విశ్వ విద్యాలయంలో విద్యార్థినిపై తుపాకీ గురిపెట్టి అత్యాచారానికి పాల్పడుతున్న ఐటీ సెల్ అనుచరులు పట్టుబడ్డారు. బీజేపీ ఐటీ సెల్ అధిపతి అమిత్ మాలవీయ పశ్చిమ బెంగాల్లో మహిళలను వాడుకున్నాడని, ఆయన అందమైన అమ్మాయిలను డిమాండ్ చేసేవాడని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు స్వయంగా ఆరోపించారు. అమ్మాయి ఎంత అందంగా ఉంటుందో, అంత పెద్ద పదవి ఇస్తామనేవాడట. మధ్యప్రదేశ్లోని మండ్లాలో బక్రీద్ పండుగకు ముందు 11 ముస్లిం కుటుంబాల ఇళ్లను బుల్డోజర్లతో ధ్వంసం చేశారు. వారి ఇండ్లలో గొడ్డుమాంసం దొరికిందనే ఆరోపణతో ఈ పనికి పాల్పడ్డారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంలో, వందలాది కోర్టులు, డజన్ల కొద్దీ హైకోర్టులు, సుప్రీంకోర్టు అన్నీ మౌనంగా ఉన్నాయి. దేశంలో సామాజిక వాతావరణం కలుషితమవుతోంది. బక్రీద్‌కు ఒక రోజు ముందు, జూన్ 16 ఉదయం, మధ్యప్రదేశ్లోని మండ్లాలోని భైంసా గ్రామంలో 11 ముస్లిం కుటుంబాల ఇళ్లను బుల్డోజర్లు కూల్చివేశాయని అలీజా నూర్ 'ది క్వింట్'లో రాశారు. నసీర్ అనే వ్యక్తి గోవధలో పాల్గొన్నాడని, అతని ఇంటి నుండి ఆవు మాంసం

దొరికిందని ఆరోపణ. 18 ఏళ్ల తజియా ఖురేషీ తండ్రి అసీమ్ ఖురేషీ కూడా ఈ కేసులో నిందితుడు. పొద్దుటే ఆరుగంటలకు ఇంటికి చాలా మంది పోలీసులు వచ్చారని, అమ్మమ్మ వర్ధంతి కావడంతో అప్పటికే మా ఇంట్లో చాలా మంది ఉన్నారని, పోలీసులు మా ఇంట్లోకి ప్రవేశించి ఫ్రిజ్ తెరిచి చూశారని అని తాజియా చెప్పారు. పోలీసులు ఇంట్లో వస్తువులను ధ్వంసం చేశారు, గోవధలో ఎవరు పాల్గొన్నారని పోలీసులు అడిగారట, మాకు ఏమీ తెలియదని చెబితే పోలీసులు బెదిరించడం ప్రారంభించారట. బుల్డోజర్ వస్తే మీరు అన్నీ చెప్పడం ప్రారంభిస్తారన్నారట. జూన్ 16న ఇల్లు కూల్చివేశారు. ఇది ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్యంలో పరిస్థితి. తినడానికి తిండి, కట్టుబట్టలు కూడా మిగలని పరిస్థితిలో ఉన్నామని ఆ కుటుంబం చెప్పింది. అంటే, సంతోషకరమైన పండుగ ఉండాల్సిన రోజున, అన్ని వైపులా సంతాపం ఉంది. నాలుగు నెలల తరువాత వివాహం జరగవలసిన యువతి తాజియా ఇంటి పరిస్థితి ఇది. పోలీసులు గొడ్డు మాంసం అని పిలిచేవి నసీర్ ఇంట్లో దొరికాయని, కానీ పోలీసులు అందరి ఇండ్లపై ఎందుకు పడ్డారని బాధితులు అడుగుతున్నారు. అయినా ఒకవేళ ఇంట్లో గొడ్డు మాంసం దొరికితే దానిపై చట్టప్రకారం కేసు నమోదు చేయాలి. ఇళ్లను కూల్చివేయడం ఏమిటి? అయితే స్థానిక ఎస్పీ మాత్రం గొడ్డు మాంసం, కూల్చివేతలు రెండు వేర్వేరు విషయాలు అంటున్నారు. మాంసం కారణంగా కూల్చివేతలు జరగలేదంటున్నారు. జిల్లా కలెక్టర్ కూడా ఇలాగే అంటున్నారు. అక్రమంగా కట్టిన ఇండ్లు కాబట్టి కూల్చేశామని అంటున్నారు. ఇది ప్రభుత్వ భూమి అని తమకు ఎవరు ఎప్పుడు ఎందుకు చెప్పలేదని బాధితులు అడుగుతున్నారు. మాకు నోటీసు ఇచ్చినట్లయితే ఇక్కడ ఇంటిని కట్టేవాళ్లమే కాదంటున్నారు. అదే భూమిలో ఇంకా కొన్ని ఇళ్లు మిగిలి ఉన్నాయట. వీటిని పోలీసులు కూల్చివేయలేదు. అదే భూమిలో కొన్ని ఇళ్లను కూల్చివేయడం, కొన్ని ఇళ్లను విడిచిపెట్టడం గురించి కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా యంత్రాంగ సూచనల మేరకు ఆ ఇళ్లను తొలగిస్తామని స్థానికులు హామీ ఇచ్చినందున కొన్ని ఇళ్లను వదలివేశారని చెప్పారు. పత్రాల ప్రకారం, ప్రజలు దశాబ్దాలుగా అక్కడ నివసిస్తున్నారు కదా అని అడిగినపుడు దశాబ్దాలుగా అక్కడ నివసిస్తున్నారనే సమాధానం వచ్చింది, అంటే భూమి వారికి చెందినదని అర్థం. ఇదంతా గొడ్డుమాంసం ఆరోపణలతో జరిగిన చర్య అన్నది అర్థమవుతూనే ఉంది. అక్కడ ఒక వ్యక్తి ఇంట్లో గొడ్డు మాంసం దొరికిందనే ఆరోపణలతో ఇండ్లు కూల్చేశారు. ఒక మహిళ మాకు ధరించడానికి దుస్తులు కూడా లేవని అన్నారు. ఈ ప్రశ్నలకు ఎవరు సమాధానం ఇస్తారు.

తీర్పులు చెప్పే అధికారం పోలీసుల చేతుల్లో ఉంటే, అప్పుడు కోర్టుల పెద్ద భవనాలు ఎందుకు? ఇక్కడ భూముల ధరలు పెరిగాయి. ఈ భూములకు భారీ మొత్తాలు దొరుకుతాయి. చాలా మంది సంపాదించుకుంటారు, నేతల జేబులు నింపుతారు. దేశవ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో దిగువ కోర్టులు ఉన్నాయి, వందలాది మంది న్యాయమూర్తులు ఉన్నారు. ఢిల్లీలో సుప్రీంకోర్టు ఉంది. కోర్టు పని పోలీసులు చేస్తున్నప్పుడు కోర్టులు ఏం చేస్తున్నట్లు? ప్రజలు సోషల్ మీడియాలో ఇప్పుడు ప్రశ్నిస్తున్నారు. న్యాయవ్యవస్థపై నమ్మకం పతనమవుతోంది. హిమాచల్ ప్రదేశ్లో జరిగిన సంఘటన చూడండి. ఒక ముస్లిం వ్యక్తి వాట్సాప్‌లో తాను ఖుర్బానీ చేశానని రాశాడు. అతని దుకాణాన్ని ధ్వంసం చేశారు. అతను గోవధ చేసి ఉంటే న్యాయస్థానం శిక్షించాలి. ప్రజలను శిక్షించే హక్కును ఎవరిచ్చారు అనేది ప్రశ్న. హిమాచల్ ప్రదేశ్‌లోని నహాన్ నుండి 16 మంది ముస్లిం దుకాణ దారులు తరలిపోవలసి వచ్చింది. పోలీసులు ప్రేక్షకులయ్యారు. బీజేపీ ప్రభుత్వాలు న్యాయం చేస్తాయనే ఆశ కూడా లేదు. కానీ హిమాచల్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది, అక్కడి పోలీసులు ఎందుకు మౌనంగా ఉన్నారు అనేది ప్రశ్న.

దుకాణాన్ని ధ్వంసం చేసిన గుంపును హిమాచల్ పోలీసులు అరెస్టు చేస్తారా. కేసు నమోదు చేస్తారా వారికి ఏదైనా శిక్ష పడుతుందా? బుల్డోజర్ తీర్పు ఇచ్చే అధికారం ఇప్పుడు పోలీసులకు ఇచ్చినట్లే ఇలాంటి తీర్పులు ఇచ్చే అధికారం అల్లరిమూకల గుంపుకు కూడా లభించిందా? మతతత్వ గుండాలు అబద్ధాల ప్రచారంతో తల్లి కొడుకును పెళ్ళి చేసుకుందని హోరెత్తిస్తే ఆ తల్లికొడుకుల పరిస్థితి ఎలా ఉంటుంది? నా మతం కారణంగా నా తల్లితో నాకు సంబంధం అంటగట్టిన దేశంలో పుట్టినందుకు ఆ కొడుకు ఏమనుకుంటాడు? మధ్యప్రదేశ్‌లో ఇళ్లను కూల్చివేసిన వారు, తినడానికి ఆహారం లేనివారు, నివసించడానికి పైకప్పు లేనివారు, ధరించడానికి దుస్తులు లేనివారు, వివాహానికి ముందు రోడ్డునపడి కట్టుబట్టలతో నిలబడిన అమ్మాయి మనస్సులో ప్రజాస్వామ్య భారతదేశ చిత్రం ఎలా ఉంటుంది? హిమాచల్ ప్రదేశ్‌లోని యూపీకి చెందిన జావేద్ దుకాణంలో దోపిడీ తర్వాత పారిపోవాల్సి వచ్చిన 16 మంది ముస్లిం దుకాణదారులు మనోభావాలు ఎలా ఉంటాయి? పిల్లలే దేశ భవిష్యత్తు. గత సంవత్సరం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత, ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ మాటల ద్వారా మాత్రమే కాకుండా చర్యల ద్వారా న్యాయవ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని పెంచుతానని దేశ ప్రజలకు హామీ ఇచ్చారు. ఆ హామీ గురించి ప్రశ్నించాల్సిన సమయం వచ్చింది.



# అయోధ్యలో ఏం జరిగింది?

గీటురాయి డెస్క్

పార్లమెంటులో ఎంపీల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. సమాజ్ వాది పార్టీ నాయకుడైన అఖిలేష్ యాదవ్ పార్టీకి చెందిన 37 మంది ఎంపీలతో కలిసి తమ పార్టీ అయిన ఎర్ర టోపీ ధరించి పార్లమెంటుకు అట్టహాసంగా వచ్చారు. ఆయన ఒక చేత్తో రాజ్యాంగం ప్రతిని మరో చేత్తో అయోధ్య నుంచి గెలిచిన అవధేశ్ ప్రసాద్‌ను పట్టుకురావడం ఆసక్తికరం. అవధేశ్ ప్రసాద్ అయోధ్య నుంచి గెలిచారు. అక్కడ భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు లల్లూ సింగ్ ఎన్నికల్లో ఓడిపోయారు. బీజేపీ అయోధ్యలో తేలిగ్గా గెలుస్తుందని చాలా మంది అనుకున్నారు. అక్కడ బీజేపీ రాముడి గుడి కట్టింది. ఆలయం అసంపూర్ణంగా ఉంటేనేం ప్రాణప్రతిష్ఠ చేసేశారు. అదే అయోధ్యలో భారతీయ జనతా పార్టీ ఓడిపోయింది. అయోధ్య నుంచి ఇప్పుడు వస్తున్న వార్తలు గమనించదగ్గవి. ఆ తర్వాత గోదీ మీడియా చానళ్ళు అయోధ్యపై అక్కసు వెళ్ళగక్కారు. అయోధ్యకు వెళితే అక్కడి వారి నుంచి నీళ్ళ పాకెట్ కూడా కొనరాదన్నారు. ఈ లోగా వర్షాలు మొదలయ్యాయి. అయోధ్యలో రామమందిరం కోసం రామ్ పథ్ వేశారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం వందలాది మంది ఇళ్లను ధ్వంసం చేశారు, దుకాణాలు పడగొట్టారు. ప్రజలు ఉపాధి, నిలువనీడ కోల్పోయారు. ఈ 13 కిలోమీటర్ల రహదారిని నిర్మించడానికి సుమారు 4500 ఇళ్ళు పడగొట్టారు. రాకేష్ కుమార్ గుప్తా అనే వ్యక్తి 1998లో తన మూడు అంతస్తుల ఇంటిని నిర్మించాడు, మార్కెట్ ప్రకారం దీని విలువ ప్రస్తుతం సుమారు 80 లక్షలు. అతనికి ఇచ్చిన పరిహారం కేవలం 8 లక్షలు మాత్రమే అని చెప్పాడట. రామమందిరం తర్వాత అయోధ్యకు కొత్త పరిశ్రమలు వస్తాయన్నారు. ఇది పర్యాటక ప్రదేశంగా మారిపోతుం దన్నారు. కాని తొలివాన కురవంగానే అయోధ్యలోని ప్రతి మూల నుండి ఫోటోలు వస్తున్నాయి. గుంతలు పడిన రోడ్లు కనిపిస్తు న్నాయి. అంటే ఇప్పటి వరకు చెప్పిన అభివృద్ధి ప్రచారం అంతా ఒక నాటకమేనా. అయోధ్యలో భూకుంభకోణాలు జరిగాయన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. భారతీయ జనతా పార్టీతో సంబంధం ఉన్న వ్యక్తులు కోట్లాది రూపాయలు సంపాదించారనే ఆరోపణలు న్నాయి. ఈ రోడ్ల నిర్మాణంలో ఎంత అవినీతి జరిగింది? తూర్పు ఉత్తర ప్రదేశ్‌లో భారీ వర్షాలు మామూలే. అక్కడ వర్షం ప్రభావాన్ని తట్టుకునేలా ఇళ్ళు కట్టుకుంటారు. కాని రాముడి పేరు చెప్పుకుని, రాముడి గుడికి వెళ్ళే దారి అని కట్టిన రోడ్డు మొదటి వానకే

గుంతలు పడింది. ఇలాగే ముంబయిలో అటల్ సేతు కట్టారు. హీరో హీరోయిన్లను పిలిచి ప్రారంభించారు. అక్కడ కూడా ఇదే పరిస్థితి చూశాం. అయోధ్యలో నిర్మించిన స్టేషన్‌లోని నాలుగు గోడలు కూడా కూలిపోయాయి. అయోధ్యలో కోట్ల రూపాయల భూమి కుంభకోణాల ఆరోపణలు వచ్చినా ఎవరూ దర్యాప్తు చేయలేదు, గుజరాత్‌లో ఒక వంతెన నిర్మించారు, ప్రజలు దానిని చూడటానికి వెళ్ళారు, అది కూలిపోయింది. బీహార్‌లో వంతెనలు కట్టారు. అక్కడ కూడా ఇదే పరిస్థితి. నీట్ పరీక్షలు జరిగాయి. పేపర్ లీకేజీ ఆరోపణలు. దేశంలో భలే విచిత్రమైన పరిస్థితి ఉంది. ఈ దేశ భద్రతకు బాధ్యత వహించే దోవల్ గారి ఇద్దరు కుమారులలో ఒకరు ఇంగ్లాండ్ పౌరుడు, ఇంకొకరు అమెరికా పౌరుడు. మన విదేశాంగ మంత్రి జైశంకర్ సాహెబ్ కుమారుడు కూడా అమెరికా పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని తెలిసింది. దేశంలో పరిస్థితి ఏమిటంటే, కాస్త డబ్బున్నవాళ్ళు తమ పిల్లలను విదేశాల్లో సెటిల్ చేయాలనుకుంటున్నారు. ఎందుకంటే ఈ దేశంలో సమయానికి పరీక్షలు జరగవు. పేపర్లు లీక్ అవుతాయి. ఉపాధి లేదు. ఉద్యోగాలు లేవు. జరుగుతున్న అభివృద్ధి ఏమిటంటే, మొదటి వర్షంలో వేసిన రోడ్లు గుంతలు పడతాయి. అయోధ్యలో వేసిన రామ్ పథ్ కేవలం విఐపి రాకపోకల కోసం ఆరు నెలలు లేదా ఎనిమిది నెలలు ఉంటే చాలనుకుని వేశారా? అయోధ్యలో రామ్ పథ్ నిర్మించిన వారికి అయోధ్యలో ఎలాంటి వర్షం పడుతుందో తెలియదా? అయినా గుంతలు ఎలా పడ్డాయి? ఇందులో అవినీతి ఉంది. ఎవరికి కాంట్రాక్ట్ ఇచ్చారో చూస్తే అవినీతికి మూలాలు ఎక్కడ ఉన్నాయో అర్థం అవుతుంది. కానీ ఇవన్నీ విచారించేది ఎవరు? ప్రాణప్రతిష్ఠ కోసం బడానేతలు అక్కడికి వెళ్ళడం రావడం అన్నీ అయి పోయాయి. ఫోటో సెషన్లు అయిపోయాయి. ఇప్పుడు అయోధ్యలో రోడ్ల చింత కేవలం అక్కడి స్థానికులకే ఉంటుంది. అందుకే అక్కడ ప్రజలు ఎవరికి ఓటు వేయాలి, ఎవరికి ఓటు వేయకూడదు అనేది ఆలోచించారు. వారికి మొత్తం వ్యవహారాలు తెలుసు. 1990 నుండి జరుగుతున్నదంతా చూస్తూ వచ్చారు. రామ మందిరం ఉద్యమం పేరిట ఎంత మంది నాశనమయ్యారో, ఎంత మంది కుబేరులయ్యారో అంతా వాళ్ళు చూశారు. హైదరాబాద్ నుండి అయోధ్యకు నేరుగా విమానాలు ఇస్తామని స్పైస్ జెట్ చాలా గర్వంగా చెప్పింది. దేశవ్యాప్తంగా ఇతర ప్రదేశాల నుండి విమానాలు ప్రారంభమవుతాయన్న ప్రకటనలు ఆర్భాటంగా వచ్చాయి. కాని చాలా నగరాల నుండి విమానాలు ఇప్పుడు రద్దు చేయబడ్డాయి. క్లుప్తంగా జరిగిందేమిటంటే, అయోధ్యలో ఈ నిర్మాణాలకు ఇళ్ళు కూల్చారు. దుకాణాలు కూల్చారు. రోడ్లు వేశారు. గొప్పగా చానళ్ళలో చూపించారు. కాని ఇప్పుడు ఈ గుంతలు ఏమిటి, కాంట్రాక్టర్, ఇంజనీర్లు ఎంత తిన్నారు. ఏది ఏమైనా అయోధ్య ప్రజలు బీజేపీని ఎందుకు ఓడించారో అర్థం కావడం లేదా?


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

89 ఆయత్‌లు

# 43. అజ్ జుఖ్రుఫ్

31-32 వారంటారు, ఈ ఖుర్ఆన్ రెండు నగరాల పెద్ద మనుషులలో ఎవరికైనా ఎందుకు అవతరించ లేదు? అని. నీ ప్రభువు కారుణ్యాన్ని పంచేవారు ఈ జనులా ఏమిటీ? ప్రపంచ జీవితంలో వారి మనుగడ సాగడానికి ఒనరులనయితే మేము వీరి మధ్యన పంచిపెట్టాము. వీరిలో కొందరికి మేము మరికొందరిపైన ఎన్నో రెట్ల ఆధిక్యతనిచ్చాము, వీరు ఒకరి ద్వారా మరొకరు సేవలు పొందాలని.[31] మరి నీ ప్రభువు కారుణ్యం, (వీరి ధనవంతులు) ప్రోగుచేసుకుంటున్న సంపదలకన్నా ఎంతో అధికంగా విలువయినది.[32]

**(31వ పాదసూచిక గత సంచిక తరువాయి)**

ఒకరిని అంగసౌష్ఠవం గలవానిగా చేస్తే మరొకరిని అంగ వికలునిగా, కాళ్ళు చేతులు చచ్చుబడినవానిగా, గుడ్డివానిగా, చెవిటి, మూగవానిగా చేశాము. ఒకరిని శ్రీమంతుని సుపుత్రుడుగా చేస్తే మరొకరిని నిరుపేదకు కొడుకుగా చేశాము.

ఒకరిని వికసిత జాతి వ్యక్తిగా మరొకరిని బానిస లేదా వెనుకబడ్డ జాతిలోని వ్యక్తిగా పుట్టించాము. ఈ పుట్టుక భాగ్య నిర్మాణంలో ఎవరూ ఏమాత్రం జోక్యం చేసుకోలేరు. మేము ఎవరిని ఏ విధంగా చేస్తే అతను అలాగే రూపొందడానికి వివశుడు. ఈ విభిన్న పుట్టుకల ప్రభావం ఏది ఎవరిపై పడుతుందో దాన్ని మార్చడం ఎవరి తరమూ కాదు. ఇంకా మానవుల మధ్య ఉపాధి, శక్తి, గౌరవం, ప్రతిష్ఠ, సంపద, అధికారం మొదలయిన విషయాల పంపిణి కూడా మేమే చేస్తున్నాము. ఎవరికి మా తరఫున ఉన్నతి ప్రాప్తిస్తుందో వారిని ఎవరూ పడగొట్టజాలరు. మరెవరిపై మా తరఫున పతనం, క్షీణ దశ ప్రాప్తిస్తుందో వారిని దిగజారుడు నుండి ఎవరూ కాపాడలేరు. మా నిర్ణయాలకు ప్రతిగా మానవుల సమస్త యత్నాలూ, ఉపాయాలూ మూటకట్టుకుపోతాయి. ఈ విశ్వ జనీన దైవత్వపు ఏర్పాటులో ఈ జనులు, విశ్వస్వామి ఎవరిని తన ప్రవక్తగా చేయాలో, ఎవరిని కాదో అనే విషయం తాము నిర్ణయించాలని కోరుకుంటున్నారా?

మూడవమాట ఏమిటంటే, దైవత్వపు ఈ ఏర్పాటులో ఒక శాశ్వత నియమం పాటించడం జరిగింది. అది, సర్వం ఒకరికే లేదా సర్వం సర్వులకూ ఇవ్వరాదు అన్నది. కళ్ళు తెరచి చూడండి. మానవుల మధ్య మీకు ప్రతి చోటా వ్యత్యాసమే తప్ప మరేదీ కానరాదు. ఒకరికి ఏదయినా విషయం మేము ప్రసాదిస్తే వారిని మరేదయినా విషయానికి దూరం చేశాము, అది మరొకరి కెవరికయినా ప్రసాదించాము. ఇది ఇలా చేయడంలో గల విజ్ఞత, ఏ ఒక్కరూ మరో మానవుడి పట్ల నిరపేక్షాపరులు కారాదన్నది. ప్రతి ఒక్కడూ ఏదో ఒక విషయంలో ఇతరులపై ఆధారపడి ఉండాలి. అలాంటప్పుడు ఈ తెలివితక్కువ ఆలోచన మీ మస్తిష్కంలో ఎలా పుట్టింది, మేము హోదా, అధికారం ఇచ్చిన వారికే దైవదౌత్యమూ ఇవ్వాలని? అలా అయితే బుద్ధి, జ్ఞానం, సంపద, సౌందర్యం, శక్తి, అధికారం, ఇంకా ఇతర పరిణత విషయాలన్నీ ఒకరిలోనే ప్రోగుచేయాలని, ఒకరికి ఏదయినా ప్రాప్తం కాకపోతే మరో విషయమేదీ అతనికి ఇవ్వరాదని కూడా మీరు అంటారా ఏమిటీ?

32. ఇక్కడ దైవ కారుణ్యం అంటే ఆయన ప్రత్యేక కారుణ్యం, దైవదౌత్యం అని ఉద్దేశం. భావమేమిటంటే, మీరు మీ శ్రీమంతులను ఎవరినయితే వారి ధనం, అధికారం, పెద్దరికం కారణంగా మహా మహులని తలుస్తున్నారో వారు, ముహమ్మద్ ఇబ్ను అబ్దుల్లాహ్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్)కు ఇవ్వబడిన సంపదకు అర్హులుకారు. ఈ సంపద ఆ సంపదకన్నా ఎన్నో రెట్లు ఉన్నత మయింది. దీని అర్హతకు ప్రమాణం పూర్తిగా భిన్నమయినది. మీ చౌధరీ గారు, సేటుగారు ప్రవక్త కావడానికి అర్హుడని మీరు భావిస్తే అది మీ మస్తిష్కపు దిగజారిన స్థితికి చిహ్నం. అల్లాహ్ పట్ల ఇటువంటి అవివేకాన్ని ఎందుకు ఆశిస్తున్నారు?

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా(ర.అలై)**
**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

كِتَابُ فَضَائِلِ أَصْحَابِ النَّبِيِّ ﷺ

## 3. ప్రవక్త ప్రియ సహచరుల (రజిఅల్లాహు అన్హుమ్) గొప్పదనం

**534)** దైవప్రవక్త పవిత్ర సతీమణి హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు: నాకు లోకజ్ఞానం వచ్చే నాటికి నేను నా తల్లి దండ్రులను ఇస్లాం ధర్మావలంబీకులుగా కనుగొన్నాను. ఆ కాలంలో దైవప్రవక్త(సఅసమ్) మా ఇంటికి రాని రోజంటూ లేదు. ఆయన(స) అనుదినం ఉదయం, సాయంత్రం మా ఇంటికి వస్తూ ఉండేవారు. తరువాత (మక్కాలో) ముస్లింలపై వేధింపులు తీవ్రతరమైనప్పుడు హజ్రత్ అబూబక్ర్(రజి) అబిసీనియాకు వలసపోయే ఉద్దేశ్యంతో బయలుదేరారు. ఆయన 'బర్కుల్ గమాద్' స్థలానికి చేరుకునేసరికి ఖార్రా తెగ నాయకుడైన ఇబ్నుద్దగినా ఎదురుపడి, 'అబూబక్ర్! ఎక్కడికెళుతున్నారు?' అనడిగాడు. దానికి ఆయన, "నా జాతివారు నన్ను వెళ్ళగొట్టారు. అందుకే దేశదేశాలు తిరుగుతూ (స్వేచ్ఛగా) దైవారాధన చేసుకుందామని నిర్ణయించుకున్నాను' అని చెప్పారు. ఈ మాట విని ఇబ్నుద్దగినా 'అబూబక్ర్! మీలాంటి వారు దేశం విడిచి వెళ్ళటంగానీ, మిమ్మల్ని దేశం నుంచి వెళ్ళగొట్టడం గానీ శ్రేయస్కరం కాదు. మీరు అగత్యపరులను ఆదుకుంటూ ఉంటారు. బలహీనుల బరువు ఎత్తుకుంటూ ఉంటారు. అతిథులకు మర్యాద చేస్తుంటారు. సత్యంపై స్థిరంగా ఉన్న కారణంగా ఎవరిపైనయినా కష్టాలు వచ్చిపడినప్పుడు, వారికి సహాయపడుతూ ఉంటారు. నేను మీకు రక్షణ కల్పిస్తాను (శరణు ఇస్తాను). కాబట్టి మీరు నగరానికి తిరిగి వెళ్ళండి. మీ ప్రభువును నిర్భయంగా ఆరాధించుకోండి' అన్నాడు.

అందువల్ల ఆయన(మక్కాకు) తిరిగి వచ్చేశారు. ఇబ్నుద్దగినా కూడా ఆయనతోపాటే నగరానికి వచ్చాడు. ఆ తరువాత ఇబ్నుద్దగినా, సాయంత్రం పూట ఖురైషు నాయకుల వద్దకు వెళ్ళి, 'చూడండి, అబూబక్ర్(రజి) వంటి వ్యక్తిని నగరం నుండి వెళ్ళగొట్టడం గానీ, అతను స్వయంగా నగరం విడిచి వెళ్ళటంగానీ మనకు శ్రేయస్కరం కాదు. అతను అవస రార్థులను ఆదుకుంటూ ఉంటాడు. బంధువుల హక్కు ఇస్తుంటాడు. బలహీనుల బరువు ఎత్తుకుంటూ ఉంటాడు. అతిథి మర్యాద చేస్తాడు. సత్యం కారణంగా ఎవరి మీదనయినా ఆపద వస్తే వారికి సహాయం చేస్తుంటాడు' అని సూటిగా చెప్పాడు. ఇబ్నుద్దగినా అబూబక్ర్‌కు శరణు ఇవ్వడాన్ని ఖురైషులు కాదనలేదుగానీ, వారు ఒక ఆంక్ష విధించారు– 'అబూబక్ర్ తన ప్రభువును ఆరాధించదలిస్తే ఇంట్లోనే ఆరాధించుకోమని ఆయన గారికి చెప్పు. ఆయన ఇంట్లోనే నమాజ్ చేసుకోవాలి. ఇంకా ఏమేమి చదవాలనుకున్నా ఇంట్లోనే చదువు కోవాలి. అంతేగాని తన ఆరాధనల ద్వారా ఆయన మాకు ఇబ్బంది కలిగించరాదని, బిగ్గరగా ఆరాధన చేయరాదని చెప్పు. ఎందుకంటే అతని ఆరాధనల వల్ల మా స్త్రీలు, పిల్లలు ఎక్కడ పరీక్షలో పడిపోతారోనని మాకు భయంగా ఉంది' అని సూచించారు.

ఇబ్నుద్దగినా వచ్చి ఆ మాటలన్నీ అబూబక్ర్(రజి)కు వినిపించాడు– మీరు కొన్నాళ్ళపాటు వీటికి కట్టుబడి ఉండండి అన్నాడు. అందువల్ల ఇంటిలోపలే ప్రభువు దాస్యం చేసుకునే వారాయన. బహిరంగ స్థలాలలో నమాజ్ చేయటంగానీ, హెచ్చు స్వరంతో ఖుర్ఆన్ పఠించడం గానీ చేసేవారు కాదు. కాని కొన్నాళ్ళ తర్వాత ఆలో చించుకుని తన ఇంటి ప్రాంగణంలో నమాజ్ ఆచరించేందుకు ఒక స్థలాన్ని ప్రత్యేకించుకున్నారు. ఆ స్థలంలోనే నమాజ్ చేసేవారు. అక్కడే ఖుర్ఆన్ పారాయణం కూడా చేసేవారు. తత్ఫలితంగా అక్కడ బహుదైవారాధకుల స్త్రీలు, పిల్లలు గుమిగూడేవారు. వారంతా ఒకింత ఆశ్చర్యంగా, ఆనందంగా దానిని గమనించేవారు. హజ్రత్ అబూబక్ర్(రజి) మృదు మనస్కులు. ఖుర్ఆన్ పారాయణం చేస్తున్నప్పుడు కన్నీరును ఆపుకోలేకపోయేవారు. ఈ పరిస్థితిని చూసి బహు దైవారాధకులైన ఖురైషులు కలవరం చెందారు. వారు ఇబ్నుద్దగినాను పిలిపించారు. ఇబ్నుద్దగినా రాగానే, 'చూడు, అబూబక్ర్ తన ఇంట్లో ఉండి నమాజ్ చేసుకునే షరతుపై మేము అతనికి నీవు కల్పించిన రక్షణకు అంగీకారం తెలిపాము. కాని

ఇప్పుడతను ఈ షరతుకు విరుద్ధంగా, తన ఇంటి బయట నమాజ్ ఆచరించేందుకు ఒక స్థలాన్ని ప్రత్యేకించుకుని, బహిరంగంగా నమాజ్ చేస్తున్నాడు, బహిరంగంగానే ఖుర్ఆన్ పఠిస్తున్నాడు. తత్కారణంగా మా స్త్రీలు, పిల్లలు ఎక్కడ ఉపద్రవానికి లోనవుతారో నన్న భయాందోళన మాకు కలుగుతోంది. కాబట్టి నీవు అతన్ని నిలువరించు. ఇంటిలోపలే ఉండి అతను తన ప్రభువును ఆరాధించుకుంటే మాకు అభ్యంతరం లేదు. కాని ఒకవేళ అతను బిగ్గరగా– బహిరంగంగా– ఆరాధన చేసుకోవటంపైనే హఠం చేసే మాటైతే, అతనికి కల్పించబడిన రక్షణ (అభయం) వాపసు చేయమని చెప్పు. ఎందుకంటే నీవు అతనికి రక్షణ కల్పించి ఉండగా, ఆ వ్యవహారంలో జోక్యం చేసకోవటం మాకు తగదు. కాని అదే సమయంలో మేము అబూబక్ర్ ఉల్లంఘనా ధోరణిని కూడా సహించలేము' అని నిష్కర్షగా చెప్పేశారు.

హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు: తరువాత ఇబ్నుద్దగినా అబూ బక్ర్ (రజి) దగ్గరకు వచ్చి, 'ఏ షరతుకు కట్టుబడి నేను మీతో ఒప్పందం చేసుకున్నానో అది మీకు తెలియనిది కాదు. కనుక మీరు ఆ షరతుకు కట్టుబడి ఉండనయినా ఉండండి, లేదంటే నా ఒప్పందాన్ని నాకు వాపసు చేయండి. ఎందుకంటే, నేను ఒక వ్యక్తికి రక్షణ కల్పించి ఉండగా ఖురైషులు అతని వ్యవహారంలో జోక్యం చేసుకుంటున్నారన్న విషయం అరబ్బుల చెవిలో పడటం నాకు ఎంతమాత్రం సహించదు' అన్నాడు. దానికి అబూబక్ర్ (రజి), "నీవిచ్చిన రక్షణను నేను నీకు వాపసు చేస్తున్నాను. మహోన్నతుడగు నా ప్రభువు రక్షణ పట్ల సంతుష్టుణ్ణి అయి ఉన్నాను" అన్నారు. ఆ రోజుల్లో దైవప్రవక్త (సఅసమ్) మక్కాలోనే ఉన్నారు. ఆయన(స) ముస్లిములనుద్దేశించి, "మీరు హిజ్రత్ చేసే స్థలం నాకు కలలో చూపించబడింది. అక్కడ ఖర్జూర చెట్లు ఉన్నాయి. రెండు రాతి మైదానాల నడుమ ఆ స్థలం ఉంది" అని చెప్పారు. అందువల్ల హిజ్రత్ చేయదలచినవారు మదీనా నగరం వైపునకు హిజ్రత్ చేశారు. అప్పటికే అబిసీనియా దేశానికి వలసపోయి ఉన్నవారు కూడా మదీనా వైపునకు ప్రస్థానం చేయటం ప్రారంభించారు.

అబూబక్ర్(రజి) కూడా మదీనాకు హిజ్రత్ చేసే సన్నాహాలు మొదలెట్టారు. అయితే, "మీరు కొన్నాళ్ళు ఆగండి. బహుశా నాకూ హిజ్రత్ చేసే ఆనతి లభించవచ్చు" అని దైవప్రవక్త(స) సూచించారు. అది విని, 'ఏమిటి, మీకూ హిజ్రత్ చేసేందుకు అనుమతి లభిస్తుందా! నా తల్లిదండ్రులు మీకు అర్పితం' అని అబూబక్ర్ ఆశ్చర్యంతో విన్న వించుకోగా, "అవును" అని దైవప్రవక్త(స) చెప్పారు.

దైవప్రవక్త(స)తో కలసి హిజ్రత్ చేసే ఉద్దేశ్యంతో అబూబక్ర్(రజి) తన ప్రయాణాన్ని వాయిదా వేసుకున్నారు. తన వద్ద ఉన్న రెండు ఒంటెలకు నాలుగు నెలల వరకు తుమ్మ ఆకులు తినిపించి, బాగా బలిసేలా చేశారు. హజ్రత్ ఆయిషా (ర.అ) ఇలా అన్నట్లు ఉర్వా తెలిపారు: ఒక రోజు మేము అబూబక్ర్(రజి) ఇంట కూర్చుని ఉండగా, మిట్ట మధ్యాహ్నం వేళ అబూబక్ర్‌తో, 'దైవప్రవక్త(స) తన తలపై రుమాలు కప్పుకుని వస్తున్నారు' అని ఎవరో చెప్పారు. సాధారణంగా ఆ సమయంలో దైవ ప్రవక్త(స) మా ఇంటికి రారు. 'దైవప్రవక్త(స)పై నా తల్లిదండ్రులు ఫిదా. ఈ సమయంలో దైవప్రవక్త(స) మా ఇంటికి వచ్చారంటే, ఏదో ముఖ్యమైన పని అయి ఉంటుంది' అని అబూబక్ర్ పలికారు. అంతలోనే దైవప్రవక్త(స) వచ్చి, లోనికి వచ్చేందుకు అనుమతి కోరారు. అబూబక్ర్ ఆయన(స)కు అనుమతి ఇవ్వగానే, ఆయన లోపలికి వచ్చి, "కొన్ని క్షణాలపాటు అందరినీ ఇక్కడి నుండి వెడలిపొమ్మని చెప్పండి" అన్నారు. దానికి అబూబక్ర్(రజి), 'దైవప్రవక్తా! నా తల్లిదండ్రులు మీకు అర్పితం. ప్రస్తుతం ఇక్కడ ఉన్నవారంతా నా కుటుంబ సభ్యులే' అని వివరణ ఇచ్చారు. అప్పుడు దైవప్రవక్త(స),"నాకు హిజ్రత్ చేసేందుకు అనుమతి లభించింది" అన్నారు. దానికి అబూబక్ర్, 'దైవప్రవక్తా! నా తల్లిదండ్రులు మీపై ఫిదా. ఈ ప్రయాణంలో మీ సహచర్య భాగ్యం నాకూ లభిస్తుందా!?' అని ప్రశ్నించగా, "లభిస్తుంది" అని దైవప్రవక్త(స) బదులిచ్చారు. 'దైవప్రవక్తా! నా తల్లిదండ్రులు మీకు సమర్పితం. ఈ రెండు ఒంటెలలో ఒక దానిని తమరు తీసేసుకోండి' అని అబూబక్ర్ విన్నవించుకోగా, "తీసుకుంటాను. కాని మూల్యానికి" అని దైవప్రవక్త(స) సెలవిచ్చారు.

**(మిగతా వచ్చే సంచికలో)**

## 'చరితార్థులు'-2



# చౌదరి అఫ్జల్ హఖ్

**(1895-1942)**

**53**






**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **'చరితార్థులు' - 2 (తెలుగు)** THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

**భారత స్వాతంత్ర్యోద్యమంలో** భాగంగా ఇటు ఆంగ్లేయుల ఆధిపత్యాన్ని, అటు 'అఖిల భారత ముస్లింలీగ్' రాజకీయాలను ఎదుర్కొంటూ పంజాబ్ ప్రాంతంలో పెనుసంచలనాలకు కారణమైన 'మజ్లిస్- ఏ-అహ్రార్-ఉల్-ఇస్లాం' స్థాపకులలో చౌదరి అఫ్జల్ హఖ్ ఒకరు. ఆయన పంజాబ్ రాష్ట్రం హషియార్ పూర్‌లోని ముస్లిం రాజపుత్రుల కుటుంబంలో 1895లో జన్మించారు. బ్రిటిష్ ప్రభుత్వంలో పోలీసు శాఖలో పని చేశారు. ఆ ఉద్యోగాన్ని వదలి ఖిలాఫత్- సహాయనిరాకరణ ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్న ఆయన భారత జాతీయ కాంగ్రెస్‌కు సన్నిహితంగా మెలిగారు. 1924, 1926లో పంజాబ్ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడయ్యారు. 1928లో జరిగిన ముస్లింలీగ్ సమావేశాల్లో సైమన్ కమీషన్‌ను బహిష్కరించాలని ప్రతిపాదించిన ఆయన ప్రభుత్వ అనుకూల ధోరణి వల్ల ప్రయోజనం ఉండదన్నారు. ముస్లిం లీగ్ రాజకీయ ధోరణుల పట్ల కినుక వహించిన ఆయన 1929లో ఏర్పడిన 'మజ్లిస్-ఏ-అహ్రార్-ఉల్-ఇస్లాం' స్థాపకుల్లో ఒకరయ్యారు. ప్రజానీకంలో జాతీయ భావాలను పెంపొందించడం, ముస్లింలకు మతపరంగా సన్మార్గం చూపటం ప్రధాన లక్ష్యాలుగా నిర్దేశించుకున్న 'మజ్లిస్-యే-అహ్రార్' అధ్యక్షునిగా ఆయన పని చేశారు. 1930లో 'మజ్లిస్-ఏ-అహ్రార్-ఉల్-ఇస్లాం' రాజకీయ పార్టీగా రూపాంతరం చెందినా, భారత జాతీయ కాంగ్రెస్‌కు సన్నిహితంగా వ్యవహరించింది. 1930లో శాసనోల్లంఘన ఉద్యమంలో భాగస్వాములైన ఆయన ఆరుమాసాల జైలుశిక్షకు గురయ్యారు. అఖిల భారత ముస్లిం లీగ్‌ను సైద్ధాంతికంగా ఎదుర్కొంటూ పంజాబ్ ప్రాంతంలో గట్టి పట్టు సంపాదించిన అహ్రార్ పార్టీకి మేధోపరంగా తోడ్పాటు ఇచ్చిన కారణంగా 'ముఫక్కి-ఏ-అహ్రార్'గా ఆయన విఖ్యాతిగాంచారు. 1931లో తొలిసారిగా చౌదరి అఫ్జల్ పంజాబ్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1931 నుండి భారత జాతీయ కాంగ్రెస్‌తో పాటుగా పలు బ్రిటిష్ వ్యతిరేక కార్యక్రమాలలో పాల్గొంటూ అహ్రార్ పార్టీ ముందుకు సాగటంలో ఆయన ప్రముఖ పాత్ర నిర్వహించారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం–అభ్యున్నతికి నిరంతరం కృషి సాగించారు. ఆ క్రమంలో ఆధ్యాత్మిక–ఆర్థిక అంశాలను వస్తువుగా స్వీకరించి పలు గ్రంథాలను రచించారు. స్వేచ్ఛా–స్వాతంత్ర్యాల ఆవశ్యకతను వివరిస్తూ 'ఆజాద్-ఏ-హింద్' గ్రంథాన్ని ఆయన రచించి ప్రచురించారు. 1940 తరువాత అఖిల భారత ముస్లింలీగ్ ముందుకు తెచ్చిన 'భారత విభజన' ప్రతిపాదనను తీవ్రంగా ఖండించి లీగ్ వ్యతిరేక కార్యక్రమాలను ముమ్మరం చేసిన చౌదరి అఫ్జల్ హఖ్ 1942 జనవరి 8న లాహోర్‌లో కన్నుమూశారు. ✤

కథ - యం.ఎ ఆరిఫ్, కొత్తగూడెం



# ఓ తండ్రి కథ

**ఆస్తి పాస్తులు,** డబ్బు, డాబాలు,బంగారం, భూములు పంచిన వాడు మాత్రమేనా తండ్రంటే?

ఒకతను తన కూతురి పెళ్లికి బంధువులను పిలవడానికి తన స్నేహితుడిని తోడుగా తీసుకెళ్ళాడు.ఆ బంధువుల్లో ఒకతని ఇంటికి వెళ్ళారు. అతను గవర్నమెంట్ ఆఫీసులో పెద్ద హోదా కలిగిన అధికారి. లక్షల్లో జీతం, అతని భార్య కూడా గవర్నమెంట్ ఉద్యోగం చేస్తూ లక్షల్లో సంపాదిస్తుంది. వాళ్ళ పిల్లలు కూడా విదేశాల్లో ఉద్యోగాలు చేస్తూ వారు కూడా లక్షల్లో సంపాదిస్తు న్నారు. చీకు చింతా లేని జీవితం వాళ్ళ కుటుంబానిది.పెళ్ళి కార్డు ఇచ్చి క్షేమ సమాచారాలు అడిగి తర్వాత ఆ వ్యక్తి, అతని తండ్రి గురించి అడిగాడు నాన్నగారు బాగున్నారా అని.

మీ నాన్నగారు మా ఊరు వచ్చినప్పుడు ఎంతో ఆప్యాయంగా, ప్రేమతో పలకరించేవారు. దాదాపుగా గత ఐదు సంవత్సరాలుగా నాన్నగారు కనిపించడం లేదు ఏంటి అని అడిగాడు. ఆ మాట విన్న వెంటనే ఆ అధికారి మొహం ఎర్రబారింది.

ఆ దౌర్భాగ్యుడి గురించి నన్ను అడగకండి. ఆస్తి పంపకాలలో నాకు ద్రోహం చేసిన ద్రోహి అంటూ, ఆవేశంగా తన గదిలోకి వెళ్ళి పోయాడు. ఇక మేము ఇంటి బయటికి వస్తుంటే, అక్కడ తోటమాలి కనిపించాడు. అతనిని వాళ్ళ నాన్న గారి గురించి వివరాలు అడగగా గత ఐదు సంవత్సరాలుగా వృద్ధాశ్రమంలో ఉన్నట్లు తెలిసింది అన్నాడు తోటమాలి.

ఆ వృద్ధాశ్రమం ఎక్కడ ఉందో తెలుసుకొని నేరుగా అక్కడికి వెళ్లి అయన్ని కలిసాడు ఆ వ్యక్తి. ఆయన్ను చూడగానే ఆ పెద్దాయన మొహంలో వెలుగు ప్రకాశించింది. ఎంతో ఉత్సాహంతో, ఆతృతతో నడుచుకుంటూ వచ్చి అమాంతంగా ఆ వ్యక్తిని కౌగిలించుకొని కన్నీరు కారుస్తూ, మీ నాన్నగారిని కలిసినట్టుగా ఉంది అంటూ ఏడవసాగాడు.

బాబాయ్ గారు ఎలా ఉన్నారు. మీ ఆరోగ్యం ఎలా ఉంది అని అడిగినందుకు ఆయన కళ్ళు చమర్చగా "అందరూ ఉండి కూడా అనాథగా బ్రతుకుతూ తను అనుభవిస్తున్న నరకయాతనల గురించి ఆయన మాటల్లో వింటుంటే, పగవాడికి కూడా ఇలాంటి దుస్థితి రాకూడదు అనుకుంటూ, ఆ వ్యక్తి పూర్తి వివరాలను ఆయనకు వ్రాయించి ఇచ్చి బయలు దేరబోతున్న అతనిని మరొకసారి ముద్దాడి నాయనా మీ అమ్మ, నాన్నలు చాలా అదృష్టవంతులు ఒక్క పైసా కూడా నీకు పంచ లేకపోయినా నీకు ఉద్యోగం, వ్యాపారం లేకపోయినా వారు నిర్వర్తించవలసిన కార్యక్రమాలను నీ బాధ్యతగా నిర్వహించి వారికి ఏ కష్టమూ కలుగకుండా నీవు వారిని పువ్వుల్లో పెట్టుకుని చూసుకుంటున్నావు.

నీవు నిజంగా ధన్యజీవివి నాయనా! అంటూ ఆశీర్వదించాడు. అక్కడ నుండి తిరిగి వచ్చిన ఆ వ్యక్తికి ఆ కుటుంబ సభ్యులలో మార్పు తేవాలన్న బలమైన సంకల్పం ఏర్పడింది. వెంటనే ఒక కథను టైప్ చేసి ఆ కుటుంబ సభ్యులందరి వాట్సాప్ నెంబర్ లకు పంపించాడు. పది రోజుల తర్వాత బాబాయ్ గారి దగ్గర నుండి ఫోన్ వచ్చింది. ఆయన ఆనందానికి అవధులు లేవు. నాయనా నీవు వచ్చి పోయిన వారం రోజుల తరువాత ఆ దేవుడి వరమో ఏమో గాని నా కొడుకు, కోడలు, మనవళ్ళు వచ్చి నన్నేంతో గౌరవంగా ఇంటికి తీసుకొచ్చారు. వచ్చిన వెంటనే నా మనవడికి

నీ ఫోన్ నెంబర్ ఇచ్చి ఫోన్ చేస్తున్నాను. అంటూ చెబుతున్న ఆయన మాటల్లోనే ఎక్కడ లేని ఆనందాన్ని చూశా...

ఆ కుటుంబ సభ్యులలో అంతలా మార్పు తెచ్చిన ఆ కథ ఏమిటంటే!

ఒకతను కారులో ఊరికి వెళ్ళి పని చూసుకొని తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. కారు అకస్మాత్తుగా ఆగిపోయింది. ఎంత ప్రయత్నించినా అది స్టార్ట్ కాలేదు. మండుటెండలో ఆ దారిలో ఎవరైనా వస్తారేమో అని కొద్దిసేపు వేచి చూశాడు.

కానీ, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల, ఎవరూ రాకపోవడంతో విధిలేక కారు లాక్ చేసి నడుచుకొంటూ కొంతదూరం వెళ్ళాక నాలుగు రోడ్ల కూడలిలో ఒక సోడా బండి కనిపించింది. అతనికి దాహం వేసింది. ఆ సోడ బండి వ్యక్తితో తాగడానికి ఒక చల్లని సోడా ఇవ్వమని అడిగాడు. అతను తాగేందుకు సోడా ఇచ్చి అతని వివరాలను అడిగాడు. అతను అడ్రస్ చెప్పగానే మీ నాన్న గారి పేరు కరీం గారు కదా అని అడిగాడు. అవును అనగానే అతను ఎంతో అభిమానంగా "నువ్వు ఆ మహానుభావుడి కొడుకువా? ఇలా నీడలోకి వచ్చి కూర్చోండయ్యా" అని అన్నాడు. "మీరు ఇక్కడే ఉండండి, నేను ఊర్లోకి వెళ్ళి కారు రిపేరు చేయడానికి మెకానిక్‌ను పిలుచుకొని వస్తాను" అని సైకిల్ తీసుకొని వెంటనే ఊర్లోకి వెళ్ళి, పది నిమిషాలకు ఒక మెకానిక్‌ను వెంట బెట్టుకొని అక్కడికి వచ్చాడు. సైకిల్ తొక్కడం వల్ల పట్టిన చెమటలు తుడుచుకుంటున్న ఆ వ్యక్తి వైపు అతను ఆశ్చర్యంగా చూస్తూ, అవునూ "మా నాన్న గారు మీకెలా తెలుసు? నా పని కోసం నీ వ్యాపారాన్ని కూడా వదిలి ఎందుకు వెళ్ళావు?" అని అడిగాడు. దానికి అతను, "కొన్నేళ్ళ క్రితం నా కూలింగ్ మిషన్ రిపేరు కొరకు మీ ఏరియాకు దగ్గరగా ఉన్న మెకానిక్ దగ్గరకు వచ్చి కూలింగ్ మిషన్‌ని రిపేరు చేసుకొని రాత్రి పూట సుమారు పదకొండు గంటల టైంలో ఆటోలో తీసుకొస్తున్న సమయంలో మీ ఇంటి ముందే ఆటో టైర్ పగిలిపోవడం వల్ల వచ్చిన శబ్దానికి మీ నాన్నగారు బయటికి వచ్చి అవస్థలు పడుతున్న మమ్మల్ని గమనించి ఇంటి ముందు వరండాలో కూర్చో పెట్టారు.

నేను ఉదయం నుండి కూలింగ్ మిషన్ సామాను కొరకు తిరిగి తిరిగి అలసిపోయి ఉన్నాను. మధ్యాహ్నం భోజనం కూడా చేయలేదు. సమయం లేక కాదు డబ్బు లేక.

ఆకలి కావడంతో, నాకు కళ్ళు తిరిగినట్లుగా అనిపించి అక్కడే ఒక చోట కూలబడ్డాను. నన్ను చూసిన మీ నాన్నగారు వెంటనే మీ ఇంట్లోనే నాకు కడుపు నిండా అన్నం పెట్టించాడు. ఆ రాత్రి పడుకోవడానికి నాకు వసతి కల్పించారు. జీవితాంతం ఆయనని నేనెప్పటికీ మరువలేనయ్యా" అని అన్నాడు.

ఇది విన్న అతనికి కొద్దిసేపు నోట మాటలు రాలేదు. ఎప్పుడో మా నాన్నగారు ఒక్కసారి అన్నం పెట్టి పడుకోవడానికి చోటు కల్పించిన విషయాన్ని ఇంకా ఇప్పటికీ గుర్తు పెట్టుకొని మా నాన్న గారి పైన ఇతను ఇంతగా ఆప్యాయతను చూపుతున్నాడే మరి అలాంటి తండ్రిని తనేం చేశాడో అనేది తెలుచుకొని ఉద్వేగానికి లోనయ్యాడు.

ఆ రోజు రాత్రంతా అతనికి అదే ఆలోచనతో నిద్ర పట్టలేదు. ఇంతలో తన ఏసీ రూమ్‌లో తనతో పాటు తన పక్కనే పడుకొన్న తన పెంపుడు కుక్క మూలుగు విని ఆత్రుతతో దాన్ని నిమిరి అతడిలో ఆలోచన రేగింది.

ఈ కుక్క కోసం తాను కల్పిస్తున్న సౌకర్యాలలో, దానికోసం పెడుతున్న ఖర్చులో కేవలం పది రూపాయలు కూడా తన తండ్రికి పెట్టలేకపోతున్నా అనిపించింది.

ఏ సంబంధమూ లేని "ఎవరో బయట వ్యక్తి మా నాన్నగారు ఒక్క పూట అన్నం పెట్టి విశ్రాంతి తీసుకోవడానికి ఒక్క రాత్రి చోటు ఇచ్చిన ఆ పనిని గుర్తుంచుకొని దానికి కృతజ్ఞతగా నన్ను అంతలా ఆత్మీయంగా చూసుకున్నాడే, ఒక వీధి కుక్కకు ఒకపూట అన్నం పెడితే తరువాత కనిపించిన ప్రతి సారి విశ్వాసంతో తోకాడిస్తూ మన కాళ్ళచుట్టూ తిరుగుతూ విశ్వాసం చూపిస్తుందే. మరి నా చిన్నప్పటి నుండి మానాన్న గారు నా ఆకలి తీర్చడం కోసం, నా సుఖం కోసం ఎన్నో రకాల సౌకర్యాలను నాకు కల్పించడం కోసం, ఎన్నెన్ని కష్టాలు పడి నన్నీ స్థితిలోకి తీసుకువచ్చాడో అలాంటి నా కన్నతండ్రి పైన నేను ఎలాంటి విశ్వాసం చూపించాను, కనీసం ఒక వీధి కుక్క చూపించే విశ్వాసం, కృతజ్ఞత కూడా చూపించకుండా నిర్దాక్షిణ్యంగా ఆయనను అనాథ ఆశ్రమంలో వదిలి ఎంతటి తప్పు చేసాను" అని అతను తీవ్రంగా మదనపడ్డాడు. పశ్చాత్తాపంతో కుమిలిపోయాడు. వెంటనే ఆశ్రమానికి వెళ్ళి తన తండ్రిని ఇంటికి తీసుకువచ్చి, చేసిన తప్పుకు క్షమించమని వేడుకున్నాడు.

చివరగా చెప్పేదేమిటంటే "తల్లిదండ్రులు" నాకేమి పంచిచ్చారని కాకుండా, ఇంత గొప్ప జన్మనిచ్చిన వారిని నీవెలా చూసుకొంటున్నావన్నదే ముఖ్యమైన అంశం అని తెలుసుకోండి.



# ముహర్రం అల్లాహ్ మాసం

## (సందేహాలు- సమాధానాలు)

**సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ**

**సృష్టికర్త** అయిన అల్లాహ్ కొన్ని కాలాలను మరికొన్ని కాలాలపై, కొన్ని ప్రదేశాలను మరికొన్ని ప్రదేశాలపై ప్రాధాన్యతనిచ్చాడు. శుక్ర, సోమ, గురు వారాలు వారాంతంలో ఉంటే, చంద్ర మానపు 13,14, 15 తేదీలు- అయ్యామె బీజ్ నెలల్లో ఉంటే, నాలుగు గౌరవ ప్రదమయిన మాసాలు యేడాదిలో ఉంటే, రమజాను మాసం, జుల్ హిజ్జా మాసపు తొలి 10 రోజులు, ముహర్రమ్ మాసపు ఆషూరా దినం, షాబాన్ మాసం లాంటి వాటిని ప్రత్యేకమయిన రుతువులుగా చెప్పుకోవచ్చు. అలాగే స్థల పరంగా తీసుకుంటే, మస్జిద్‌లు, మక్కా, మదీనా, బైతుల్ మఖ్దిస్, మస్జిదె హరామ్, కాబహ్, మస్జిదె నబవీ, మస్జిదె అఖ్సా మొదలయినవి ఉన్నాయి. ఈ క్రమంలో ఇస్లామీయ క్యాలెండర్‌లో తొలి మాసంతో ముడిపడి ఉన్న కొన్ని విషయాలను ప్రశ్నోత్తరాల రూపంలో పాఠకులకు అందజేయడమే ఈ వ్యాస ముఖ్యోద్దేశ్యం!

హజ్రత్ అబూ జర్ గిఫారీ (ర) గారి కథనం- నేను ప్రవక్త (స) వారిని అడిగాను: 'రాత్రిలో ఏ ఘడియ గొప్పది? లేదా మాసాలలో ఏ మాసం గొప్పది' అని. దానికి ప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు: "రాత్రి నడి రేయి సమయం గొప్పది. మాసాల్లో అల్లాహ్ మాసం, దేన్నయితే మీరు ముహర్రమ్ అని పిలుస్తారో అది గొప్పది". (ముస్నద్ అహ్మద్)

ప్రశ్న : అల్లాహ్ గ్రంథంలో నెలల సంఖ్య ఎంత? వాటి పేర్లు ఏమిటి?

జవాబు : "నిశ్చయంగా నెలల సంఖ్య అల్లాహ్ దగ్గర అల్లాహ్ గ్రంథంలో పన్నెండు మాత్రమే. ఆయన ఆకాశాలను, భూమిని సృష్టించిన రోజు నుంచీ (ఈ లెక్క ఇలానే సాగుతున్నది). వాటిలో నాలుగు మాసాలు నిషిద్ధమయినవి (గౌరవప్రద మయినవి). ఇదే సరయిన ధర్మం. కాబట్టి ఈ మాసాలలో మీకు మీరు అన్యాయం చేసుకోకండి". (తౌబహ్: 36)

పై ఆయతులో యేడాదికి 12 నెలలు అని వాటిలో నాలుగు గౌరవప్రదమయిన మాసాలని, వాటిలో దౌర్జన్యానికి పాల్పడరాదని, ఇదే సరయిన ధర్మం అని చెప్పడం జరిగింది. ఆ రకంగా ప్రపంచ వ్యాప్తంగా సూర్య మానాన్ని అనుసరించి, చంద్ర మానాన్ని అనుసరించి చేసుకోబడిన క్యాలెండర్లలో నెలల సంఖ్య 12గానే ఉంది. కొన్ని ప్రాంతాల్లో తప్ప. ఉదాహరణకు ఇథియోపియాలో నెలల సంఖ్య 13. నెలకి 30 రోజులు, మిగిలిన 5 లేదా 6 రోజుల్ని వారు మతపరమయిన విశ్వాసంతో ముడిపెట్టి ఒక నెలగా ఖరారు చేసి, ఆ నెలను బాగ్మీ అని పిలుస్తుంటారు.

ఇస్లామీయ క్యాలెండర్‌లోని నెలల పేర్లు ఇలా ఉన్నాయి. ముహర్రమ్, సఫర్, రబీవుల్ అవ్వల్, రబీవుస్సానీ, జుమాదల్

ఊలా, జుమాదల్ ఆఖర్, రజబ్, షాబాన్, రమజాన్, షవ్వాల్, జుల్ ఖఅదహ్, జుల్ హిజ్జహ్.

ప్రశ్న : నిషిద్ధ మాసాలుగా పేర్కొనబడిన వాటి పేర్లు ఏమిటి?

జవాబు : ప్రవక్త(స) ఇలా ఉపదేశించారు: "కాలం తిరిగి భూమ్యాకాశాలను పుట్టించిన నాటి స్థితికి వచ్చేసింది. యేడాదికి 12 నెలలు. వాటిలో నాలుగు నిషిద్ధ మాసాలు. మూడు ఒకదాని తర్వాత మరొకటిగా వస్తాయి-జుల్ ఖఅదహ్, జుల్ హిజ్జహ్. ముహర్రమ్. రజబ్ అనే మాసం జుమాదివుల్ ఆఖిర్, షాబాన్ నెలకి మధ్యన వస్తుంది". *(బుఖారీ)*

ప్రశ్న : 'వాటిలో మీకు మీరు అన్యాయం చేసుకోకండి' అంటే అర్థం?

జవాబు : ఇమామ్ ఖుర్తుబీ (రహ్మ) ఇలా అన్నారు: అల్లాహ్ పవిత్ర మాసాలను తన స్మరణ-జిక్ర్ కోసం ప్రత్యేకించాడు. దౌర్జన్యం, దుర్మార్గం, పాప కార్యాల నుండి వారించాడు. ఇవి అన్ని వేళలా పాటించాల్సిన ఆదేశాలే అయినా, ఈ నాలుగు మాసాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలి.

అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(ర) గారు - 'వాటిలో' అంటే 12 మాసాలలో అని అభిప్రాయపడ్డారు.

ప్రశ్న : ఈ నాలుగు మాసాలలో ముహర్రమ్ మాసానికి గల ప్రత్యేకత ఏమిటి?

జవాబు : ఇబ్ను రజబ్ (రహ్మ) ఇలా అన్నారు: "నిషిద్ధ మాసాలలో ఏ మాసం గొప్పది అనే విషయంలో పండితుల మధ్య భేదాభిప్రాయాలున్నాయి. హసన్ బస్రీ (రహ్మ) ఇలా అన్నారు: "అల్లాహ్ యేడాదిని పవిత్ర మాసంతో ప్రారంభించాడు. పవిత్ర మాసంతో ముగించాడు. యేడాదిలో రమజాను మాసాన్ని మినహాయించి ముహర్రమ్ మాసానికన్నా ఘనతరమయిన మాసం మరొకటి లేదు. ప్రవక్త (స) దీన్ని అల్లాహ్ మాసంగా పేర్కొనేవారు".

హజ్రత్ అబూ జర్ గిఫారీ (ర) గారి కథనం- నేను ప్రవక్త (స) వారిని అడిగాను: 'రాత్రిలో ఏ ఘడియ గొప్పది? లేదా మాసాలలో ఏ మాసం గొప్పది' అని. దానికి ప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు: "రాత్రి నడి రేయి సమయం గొప్పది. మాసాల్లో అల్లాహ్ మాసం, దేన్నయితే మీరు ముహర్రమ్ అని పిలుస్తారో అది గొప్పది". (ముస్నద్ అహ్మద్)

ప్రశ్న : ముహర్రమ్ మాసంలో ఉపవాస ఘనతను గురించి తెలియజేయండి?

జవాబు: ఒకరి ప్రశ్నకు సమాధానంగా ప్రవక్త (స) ఇలా అన్నారు: "ఉపవాసాలలో రమజాను తర్వాత ఘనతరమయిన ఉపవాసం ముహర్రమ్ ఉపవాసం. నమాజులలో ఫర్జ్ నమాజు తర్వాత రాత్రి - తహజ్జుద్ నమాజు". (ముస్లిం)

ఇబ్నుల్ ఖయ్యిమ్ (రహ్మ) ఇలా అన్నారు: "నఫిల్ ఉపవాసాల రీత్యా ముహర్రమ్ పూర్తి మాసం మహత్తరమయినది. దినాల విషయంలో దానికన్నా గొప్ప దినాలు ఉన్నాయి- ఉదాహరణకు, అరఫా దినం, జుల్ హిజ్జా మాసానికి చెందిన తొలి పది రోజులు". అంటే ముహర్రమ్ మాసంలో అత్యధికంగా ఉపవాసాలుండేందుకు ప్రయత్నించాలి.

ప్రశ్న : హిజ్రీ క్యాలెండర్‌కి పునాది ఎలా పడింది?

జవాబు : అది హి.శ.17- ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్ (ర) గారి పరిపాలనా కాలం. ఆయన యమన్ దేశానికి గవర్నర్‌గా హజ్రత్ అబూ మూసా అష్ అరీ(ర) గారిని నియమించారు. అవసరాన్ని బట్టి ఉత్తరాల ద్వారా సలహా సంప్రదింపులు జరిగేవి. అలా వచ్చే ఉత్తరాల్లో తేది ఉండేది కాదు. ఈ ఉత్తరం ఎప్పటిది? అన్న స్పష్టత ఉండేది కాదు. ఇదే విషయాన్ని ఆయన హజ్రత్ ఉమర్ (ర) గారితో చర్చించగా, ఆయన అప్పుడున్న సహాబాను సంప్రదించి ఇస్లామీయ హిజ్రీ క్యాలెండర్‌ను రూపు ఇవ్వడం జరిగింది. అలా రూపు ఇవ్వబడిన ఆ క్యాలెండర్- హిజ్రత్ మహా ఘట్టం ఆధారంగా ఉన్నా అందులో తొలి మాసంగా ముహర్రమ్ మాసాన్నే పెట్టడం జరిగింది. కారణం- ప్రవక్త (స) మక్కా నుండి మదీనాకు జుల్ హిజ్జా మాసపు చివర్లో హిజ్రత్ చేశారు, ఆయన మదీనా హిజ్రత్ చేసి వెళ్లాక చూసిన తొలి నెలవంక ముహర్రమ్ మాసానిదే గనక.

ప్రశ్న : ఇస్లామీయ హిజ్రీ క్యాలెండర్‌కి అన్య క్యాలెండర్లకి మధ్య గల వ్యత్యాసం ఏమిటి?

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

జవాబు : ఇతర క్యాలెండర్లు వ్యక్తుల జనన, మరణాలతో, జయాపజయాలతో ప్రారంభమవుతాయి. ఇస్లామీయ క్యాలెండర్ హిజ్రత్ మహా ఘట్టంతో ప్రారంభమవుతుంది. అలాగే హిజ్రీ క్యాలెండర్ చంద్ర మానాన్ని అనుసరించి ఉంటుంది.

ప్రశ్న : హిజ్రత్ మనకిచ్చే సందేశం ఏమిటి?

జవాబు : మనిషి సత్య ధర్మమయిన ఇస్లాంను స్వీకరించి దాని ఉన్నతి కోసం పాటుపడుతున్న తరుణంలో అతనిపై కష్టాల కడగండ్లు వచ్చి పడతాయి. ఊరి జనం అతన్ని వ్యతిరేకిస్తారు. దగ్గరి బంధువులు సయితం ద్రోహానికి పాల్పడతారు. సంఘం అతన్ని బహిష్కరించాలని చూస్తుంది. అతన్ని చంపితేగానీ సమస్య ఒక కొలిక్కి రాదు అన్న కుట్ర పూరిత ప్రచారం జరుగుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే, సామ, దాన, భేద, దండోపాయాలనే అస్త్రాలు ప్రయోగించి అతన్ని లొంగదీసుకునే ప్రయత్నం జరుగుతుంది. అలాంటి విపత్కర పరిస్థితిలో అతనేం చెయ్యాలి? అసత్యం, అధర్మంతో రాజీ పడాలా? సత్యోపదేశాన్ని ఆపేయాలా? తన విశ్వాసంలో సర్దుబాటుకి సిద్ధమయి పోవాలా? ప్రాపంచిక ప్రయోజనం, ప్రాణం నిలుపుకోవడం కోసం అధర్మ సమాజంతో అడ్జస్ట్ అవ్వాలా? అవిశ్వాసుల మత పరమయిన పండుగల్లో పాల్గొని నేనూ మీలోని ఒకడిని అని చాటుకోవాలా? అంటే, లేదు. ఇలా చెయ్యడం ఒక విశ్వాసికి ఎంత మాత్రం శోభించదు. దీనికి ఇస్లాం చూపే పరిష్కారమే హిజ్రత్. అవిశ్వాస భూభాగాన్ని వదిలి విశ్వాస భూభాగం వైపునకు హిజ్రత్ చెయ్యాలి. వేరే మార్గం లేకపోతే ప్రాణాన్ని త్యాగం చెయ్యడానికి సిద్ధంగా ఉండాలి. ప్రవక్త (స) ఇలా అన్నారు: "అల్లాహ్‌తోపాటు అన్యుల్ని భాగస్వాములుగా చేసి షిర్క్‌కి పాల్పడకు, ఒకవేళ నిన్ను కాల్చేసినా, నరికేసినా". (ముస్నద్ అహ్మద్)

ప్రశ్న : ఆషూరా దినపు ఘనత ఏమిటి?

జవాబు : ఆషూరా దినం ఎంతో ఘనమయినది. దీని పవిత్రత చాలా ప్రాచీనమయినది. ఆషూరా దినాన ప్రవక్త మూసా (అ) మరియు ఆయన జాతిని ఫిర్ఔన్ కబంధ హస్తాల నుండి అల్లాహ్ కాపాడాడు. కృతజ్ఞతగా ప్రవక్త మూసా(అ) ఈ దినాన ఉపవాసం ఉన్నారు. యూదులు ఈ రోజున ఉపవాసం ఉంటారు. మక్కా అవిశ్వాసులు ఈ దినం ఉపవాసం ఉండేవారు. స్వయంగా ప్రవక్త ముహమ్మద్(స) ఈ దినపు ఉపవాసం గురించి నొక్కి వక్కాణించారు. ఈ దినపు ఉపవాసం గురించి తెలియజేస్తూ ఇలా అన్నారు: "నాకు అల్లాహ్‌పై పూర్తి నమ్మకం ఉంది. ఆయన ఈ ఒక్క రోజు ఉపవాస కారణంగా గత యేడాది పాపాలను మన్నిస్తాడ"ని. (ముస్లిం హదీసు గ్రంథం)

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (ర) గారి కథనం- "ప్రవక్త(స) ఈ దినం-ఆషూరా దినపు ఉపవాసానికి, ఈ మాసం- రమజాను మాసపు ఉపవాసానికి ఇచ్చినంత ప్రాధాన్యత, చూపినంత ఆసక్తి మరే ఇతర దినం, ఇతర మాసం గురించి నేను చూడ లేదు" అన్నారు. (బుఖారీ)

"ఆషూరాకు ఒకరోజు ముందు లేదా ఒక రోజు తర్వాత ఉపవాసం ఉండండి" అని ప్రవక్త (స) సెలవిచ్చారు. (ముస్నద్ అహ్మద్)

ఆ రకంగా ఆషూరా ఉపవాసాన్ని స్థాయి రీత్యా ఇలా విభజించడం జరిగింది. 9,10 ఇది ఉత్తమ స్థాయి. 10,11 ఇది దాని తర్వాతి స్థాయి. 9,10,11 ఆ తర్వాతి స్థాయి. కేవలం 10 ఇది అన్నింటి కన్నా తక్కువ స్థాయి.

ప్రశ్న: హజ్రత్ హుసైన్ (ర) గారికి ముహర్రమ్ మాసంతో గల సంబంధం ఏమిటి?

జవాబు: కర్బలా సంఘటన పరంగా తీసుకుంటే, ఆయన ఈ మాసంలో షహీద్ అయ్యారు. అలా షహీద్ అయిన వారు ఆయన ఒక్కరు మాత్రమే కాదు. హజ్రత్ ఉమర్ (ర) కూడా ముహర్రమ్ 1వ తేదీ పరమపదించారు. కాబట్టి ఎవరి మరణం వల్లయినా సరే ఏ మాస స్థాయిని పెంచడం, తగ్గించడం సబబు కాదు. ముఖ్యంగా ముహర్రమ్ మాసానికి గల ఘనత, ఔన్నత్యం భూమ్యాకాశాలను సృష్టించిన నాటిది. అలాంటి పవిత్ర మాసాన్ని గూగుల్‌లో సెర్చ్ చేస్తే స్క్రీన్ మొత్తం రక్తమోడుతున్న హింసాత్మక దృశ్యాలతో నిండి పోతుంది. ఈ రక్తపు మరకల్ని గౌరవప్రద మయిన ఈ మాసానికి అద్దింది ఎవరు? అసలు ఈ సందర్భంగా జరిగే స్వీయ హింసతో హజ్రత్ హుసైన్ (ర) గారి షహాదత్‌కి సంబంధం ఏమిటి? శోక ప్రకటన అనుమతి భార్యను మినహాయించి బంధువులకు మూడు రోజులు మాత్రమే అని హదీసు గ్రంథాలు ఘోషిస్తుంటే, ఇలా యేండ్ల తరబడి ప్రతి సంవత్సరం మాతమ్ చెయ్యడం ఎవరి సంప్రదాయం? ఇది ధర్మంలో బలవంతాన దూర్చబడిన అధర్మ చేష్ట తప్ప మరేమి కాదు.

**(మిగతా వచ్చేవారం)**

# బీ పాజిటివ్, ఫ్రెండ్స్!

సేకరణ : ఇమామ్‌జీ

**ఒక** వ్యక్తి రాత్రి పడుకునే ముందు తన రీడింగ్ టేబుల్‌పై తల పెట్టి అలా కూర్చుని నిద్ర పోతున్నాడు. అప్పుడు అతని భార్య అతన్ని లేపి మంచం మీద పడుకోమని చెప్పాలని వచ్చింది. అప్పుడు ఆమె దృష్టి అతని చేతిలో ఉన్న పెన్నుపై, అతని ముందున్న రైటింగ్ పాడ్‌పై పడింది. దానిమీద ఏదో రాసి వుంది. ఆమె తన భర్తను కదిలించకుండా ఆయన రాసినదాన్ని నిశ్శబ్దంగా చదవసాగింది..

అందులో ఇలా వుంది–

గత ఏడాది నాకు సర్జరీ జరిగి గాల్ బ్లాడర్ తొలగించారు. మూడు నెలలు మంచం మీదే గడపాల్సి వచ్చింది

ఈ ఏడాదే నాకు 60 ఏళ్లు నిండి నాకెంతో ప్రియమైన ఉద్యోగం నుండి రిటైర్ అయ్యాను. నేను ముప్పై ఏళ్లు ఈ కంపెనీలో రాత్రనక పగలనక కష్టపడి పని చేసి కంపెనీ అభివృద్ధిలో పాలుపంచుకున్నాను... ఆ కంపెనీతో నాకెంతో అనుబంధం ఉంది. దానితో ఇక ఋణం తీరిపోయింది.

ఈ ఏడాదే మా నాన్నగారి మరణం నా జీవితంలో విషాదం నింపింది.

ఈ ఏడాదే నా కొడుకు కారు ప్రమాదం వల్ల మంచం పట్టి మెడికల్ ఎగ్జామ్ ఫెయిల్ అయ్యాడు, ఎన్నాళ్లుగానో నాకు సేవ చేసిన నా ప్రియమైన కారు ఎందుకూ పనికిరాకుండా పోయింది.

దేవుడా! ఈ ఏడాదిలో ఎన్ని భయంకరమైన అనుభవాలు ఇచ్చావు!!

చివరి వరకూ చదివిన ఆమె నిశ్శబ్దంగా ఆ రైటింగ్ పాడ్‌ను తీసుకుని బయటకు నడిచింది. కాసేపటి తర్వాత ఆమె వచ్చి పాడ్‌ను అక్కడే పెట్టి వెళ్ళిపోయింది.

ఆయనకి మెలుకువ వచ్చింది. తన చేతిలో పెన్ను, టేబుల్ మీద రైటింగ్ పాడ్ చూసుకున్నాడు. దానిమీద తను రాసింది కాకుండా ఇంకేదో రాసి వుండటం గమనించి చదవడం ప్రారంభించాడు.

అందులో ఇలా వుంది–

గత ఏడాది నాకు గాల్ బ్లాడర్ సర్జరీ జరిగింది. చాలా కాలంగా నన్ను వేధించిన కడుపు నొప్పి నుంచి శాశ్వతంగా ఉపశమనం లభించింది.

ఈ ఏడాదిలోనే నాకు అరవై ఏళ్లు నిండాయి. సంపూర్ణ ఆరోగ్యంతో నేను రిటైర్ అయినందుకు ఆనందంగా ఉంది. ఇక నా పూర్తి సమయాన్ని నా కుటుంబంతో సంతోషంగా ప్రశాంతంగా గడుపుతాను.

ఈ ఏడాదిలోనే మా నాన్నగారు 95 ఏళ్ళ వయసులో ఎవరితోనూ చేయించుకోకుండానే ఎలాంటి ఇబ్బందీ లేకుండానే ప్రశాంతంగా సహజ మరణం చెందారు.

ఈ ఏడాది నా కొడుక్కి కొత్త జీవితం లభించింది. కారు ప్రమాదంలో కారు నుజ్జునుజ్జైనా నా కొడుకు ప్రాణాలతో బైటపడ్డాడు, కార్‌కి వచ్చిన ఇన్సూరెన్స్ డబ్బులతో మరో కొత్త కారు కొనుక్కున్నాను

దేవా! ఈ ఏడాది ఎంత సంతోషాన్ని మిగిల్చావు!! ఈ ఏడాదిని ఎంత అద్భుతంగా ముగించావు!!!"

అంతా చదివిన ఆయన చుట్టూ ఓసారి చూసాడు. కర్టెన్ వెనకాల తన భార్య నీడను గమనించి జరిగింది అర్థం చేసుకున్నాడు. తన భార్యను మనసులోనే అభినందించుకున్నాడు...


ఎంతో ప్రోత్సాహభరితంగా ఉన్న ఆ వాక్యాలు చదివిన ఆయన దైవానికి తన కృతజ్ఞతలు తెలుపుకుంటూ సంతృప్తిగా నిట్టూర్చాడు.

మహాప్రవక్త(స) ప్రవచనం జ్ఞప్తికి వచ్చింది : **"అద్దునియా కుల్లుహా మతా. వ ఖైరు మతాయిద్దునియా అల్ మర్‌అతుస్సాలిహా"**

(ఈ ప్రపంచం అంతా వస్తు సామగ్రితో నిండి ఉంది. అయితే ఈ వస్తు సంపదలో అత్యంత విలువైన వస్తువు ఏదయినా ఉందంటే ఆమె బుద్ధిమంతురాలు, సజ్జనురాలైన ఇల్లాలే)

చాలావరకూ సమస్యలు మన ఆలోచనా దృక్పథం నుంచి ఉద్భవించేవే.. మన ఆలోచనా దృక్పథం పాజిటివ్‌గా ఉంటే ఎంతటి సమస్య ఐనా దూదిపింజంలా తేలికైపోతుంది, ఫలితం అనుకూలంగా ఉంటుంది. కానీ నెగటివ్ ఆలోచనలు చిన్న సమస్యను కూడా బూతద్దంలో చూపించి మనశ్శాంతిని దూరం చేస్తాయి.

ఆనందమయమైన జీవితం కోసం పాజిటివ్‌గా ఆలోచించడం అలవర్చుకోండి..



వాహెద్

# కృత్రిమ మేధస్సు కాలంలో వినిమయ వస్తువుగా జ్ఞానం

Knowledge is not neutral or objective; Knowledge is a product of power relations - **Foucalt**

అధికారానికి, జ్ఞానానికి దగ్గరి సంబంధం ఉంది. ఆ సంబంధాన్ని బట్టబయలు చేసిన వ్యక్తి ఫుకో. ఫ్రెంచ్ తత్వవేత్త మైఖేల్ ఫుకో ప్రకారం అధికారానికి, జ్ఞానానికి మధ్య సంబంధం ఉంది. ప్రభుత్వాలు, పాఠశాలలు వంటి సామాజిక సంస్థలు తమ అధికారాన్ని కొనసాగించడానికి జ్ఞానాన్ని ఉపయోగించి సమాజం నిజమని నమ్మే నెరెటివ్స్‌ను సృష్టిస్తాయి. ఈ నెరెటివ్స్, లేదా డిస్కోర్స్ ఒక విషయం గురించి ఏది చెప్పాలో, ఎంతవరకు చెప్పాలో, ఏది చెప్పకూడదో నియంత్రిస్తుంది. ఈ సరళిలోనే సామాజిక ప్రవర్తన, ఆలోచన అన్నీ రూపుదిద్దుకుంటాయి. అధికారం కేవలం ఆంక్షలు మాత్రమే విధించదు, జ్ఞాన నియంత్రణ చర్యల ద్వారా ఆలోచనలు, కార్యాచరణలు, ఆకాంక్షలు, నమ్మకాలు అన్నింటిని నియంత్రిస్తుంది. పనోప్టిసిజం ఇక్కడే ప్రవేశిస్తుంది. తమను నిత్యం గమనిస్తున్నారనే స్పృహలో ప్రజలు జీవించడం ద్వారా సామాజిక నిబంధనలకు కట్టుబడడం జరుగుతుంది.

ఇక్కడ గమనించవలసిందేమిటంటే, అధికారం నిజానికి ఎవరిది? అధికారం చేతులు మారుతుంటే ఈ డిస్కోర్స్ కూడా మారుతూ ఉంటే ప్రజల హక్కులు, స్వేచ్ఛల పరిస్థితి ఏమిటి. ఇస్లామీయ వ్యవస్థ ఈ విషయంలో స్థిరమైన నమూనా ఇస్తుంది. అధికారం దైవానిదే కాబట్టి ప్రతినిధులుగా పాలించేవారిని ప్రశ్నించే హక్కు ఇవ్వడం ద్వారా స్వేచ్ఛలను కాపాడుతుంది. పనోప్టిసిజం అంటే ప్రవర్తనను నియంత్రించడం అనేది పాలకులు గమనిస్తున్నారనే భావన వల్ల కాదు దైవం గమనిస్తున్నాడనే భావనగా ఉంటుంది. మాలిక్ బిన్నబి ప్రతిపాదించిన నాగరికత సిద్ధాంతాన్ని గమనించినా మనకు ఈ విషయాలు తెలుస్తాయి. నాగరికతాపూర్వ సమాజాలు నాగరిక దశలోకి ప్రవేశించనప్పుడు, నాగరికతా

ప్రక్రియకు ఉత్ప్రేరకంగా ఉన్న మతవిలువలే నాగరిక దశను ఉత్థాన స్థాయికి చేరుకునేలా చేస్తాయి. ఇది ఇస్లాం విషయంలోనే కాదు, ఏ మతం విషయంలో అయినా ఆయా సమాజాల్లో జరిగేదే. అయితే, నాగరికోత్తర దశలో మనిషిలోని సహజవిశృంఖలతత్వం పైచేయి సాధించడం, నాగరికతా ప్రక్రియ విధ్వంసం కావడం వంటి పరిణామాల నేపథ్యంలో పతనోన్ముఖం అవుతుంది. ఇక్కడ నాగరికతల అధ్యయనం గురించి కాదు, జ్ఞానం గురించి చర్చిద్దాం.

అధికారానికి, జ్ఞానానికి మధ్య ఉన్న సంబంధం సామాజిక నిర్మాణాలను ప్రభావితం చేస్తుందని ఫుకో చెప్పిన మాటలు ప్రస్తుత కంప్యూటర్ యుగంలో మరింత ముఖ్యమైనవి. గత కొన్ని దశాబ్దాలుగా కంప్యూటర్ జనిత జ్ఞానం ఒక ఉత్పత్తి శక్తిగా (Force of Production)గా మారింది. దీని ప్రభావం కార్మిక వర్గంపై పడుతోంది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఫ్యాక్టరీలు, కార్ఖానాల్లో కార్మికుల సంఖ్య తగ్గిపోతోంది. వైట్ కాలర్ ఉద్యోగులు, వృత్తి నిపుణుల సంఖ్య పెరుగుతోంది. యాంత్రిక యుగం, పారిశ్రామిక విప్లవాల తర్వాత జరిగింది ఇదే. ఇప్పుడు కృత్రిమ మేధస్సు కాలంలో వైట్ కాలర్ ఉద్యోగాలు కూడా తగ్గి పోతున్నాయి. కొత్త ఉద్యోగాలు వస్తున్నాయి. చాట్ జిపిటీ వచ్చిన తర్వాత జ్ఞానానికి నిర్వచనం అన్ని విధాలుగా మారిపోతోంది. ల్యూతార్ ప్రకారం భవిష్యత్తులో అంతర్జాతీయ బలాధిక్యతల క్రీడలో కంప్యూటర్ జనిత జ్ఞానం కీలకపాత్ర పోషిస్తుంది. జాతులు, దేశాల భవిష్య స్నేహాలు, వైరాలు అన్నీ ఎలక్ట్రానిక్ జ్ఞానంపై నియంత్రణ కోసమే ఉంటాయి. అంటే జ్ఞాన భాండాగారాలపై అదుపు దేశాలను జయించడంతో సమానంగా మారుతుంది. ప్రస్తుత డాటా యుగంలో ఈ మాటలను మరింత చక్కగా అర్థం చేసుకోవచ్చు. పెగాసస్, కేంబ్రిడ్జ్ ఎనలిటికాల గురించి చాలా మందికి గుర్తుండే ఉంటుంది. సామాజిక మాధ్యమాలు వచ్చిన తర్వాత పరిస్థితిని మనమంతా చూస్తూనే ఉన్నాం. అంతర్జాతీయ స్థాయిలో జ్ఞానభాండాగారాల కోసం దురాశ మొదలవుతుంది. ప్రస్తుతం జరుగుతున్న డాటా యుద్ధాలు కూడా మనకు తెలిసినవే. ల్యూతార్ చెప్పిన మరో మాట ఏమిటంటే, ప్రతి విషయం టెక్నాలజీపై ఆధారపడుతుంది. అందువల్ల అభివృద్ధి చెందిన, వర్ధమాన దేశాల మధ్య దూరాలు తగ్గవు. ఇంకా పెరుగుతాయి. ముఖ్యమైన విషయమేమిటంటే, శక్తి, జ్ఞానం రెండు ఒకే నాణేనికి రెండు పార్శ్వాలుగా ఉంటాయి. విట్గెన్‌స్టీన్ చెప్పిన భాషాక్రీడలు (Linguistic Games) గురించి ల్యూతార్ ప్రస్తావించాడు. ప్రతి శక్తి క్రీడలో జ్ఞానం సాధనంగా ఉంటుంది. మనం సాధారణ సంభాషణల్లో కూడా యుద్ధ పారిభాషికాలను ఉపయోగించడం జరుగుతోంది. ఉదాహరణకు: దాడి చేయడం జరుగుతోంది, విరుచుకుపడ్డారు, మట్టికరిచాడు వంటి పదప్రయోగాలు రోజువారి సంభాషణల్లో వచ్చేశాయి. ల్యూతార్ ప్రకారం కంప్యూటర్ సమాజంలో మాట్లాడడమంటే To Speak is to Fight. ఎప్పుడో 1979లో ల్యూతార్ చెప్పిన మాటలు ఇప్పుడు అక్షర సత్యాలుగా కనిపిస్తున్నాయి. ఇప్పుడు మాట్లాడడం పోట్లాడడమే అవుతుంది. ఇదే సర్వసాధారణమైపోతుంది. భవిష్యత్తులో పోట్లాటలు కంప్యూటర్ భాషలో జరుగుతాయి. ఎప్పుడు ఏ ఎత్తుగడ పని చేస్తుంది, ఈ నిర్ణయాన్ని మానవబుద్ధి కాదు, కంప్యూటర్ తీసుకుంటుంది. ఇవన్నీ ఆయన చాలా దశాబ్దాల క్రితం కృత్రిమ మేధస్సు గురించి ఊహించలేని కాలంలో చెప్పిన మాటలు.

ఇప్పుడు జరుగుతున్నది గమనిస్తే, జ్ఞానం ఇప్పుడు డబ్బుతో లభిస్తుంది. ఒక మంచి స్మార్ట్ ఫోన్, ఇంటర్నెట్ కనెక్షన్ మీ చేతుల్లో ఉంటే ఏ విషయం గురించైనా పూర్తి సమాచారం అందించే ఏఐ టూల్స్ ఉన్నాయి. చాట్ జిపిటీ అందులో ఒక్కటి మాత్రమే. పుస్తకాల భాండాగారాలను ఔపోసన పట్టి కష్టపడే పనిలేదు. చేతిలో ఇమిడిపోయే చిన్న పరికరం మీ బుర్రలో ఉండవలసిన జ్ఞానాన్ని చాలా సునాయాసంగా, మీకు ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎంత అవసరమో ఆ స్థాయిలో మీకు అందిస్తుంది. దీన్ని కొనగలిగే ఆర్థిక స్తోమత మీకు ఉండాలి.

ల్యూతార్ మరిన్ని విషయాలు తెలియజేశాడు. జ్ఞానానికి సంబంధించి రెండు రకాలను పేర్కొన్నాడు. ఒకటి శాస్త్రీయ జ్ఞానం లేదా సైంటిఫిక్ జ్ఞానం. రెండవది ఆఖ్యానం (Narrative). ల్యూతర్ ప్రకారం శాస్త్రీయ జ్ఞానం, అఖ్యానాల మధ్య ఘర్షణల సంబంధం ఉంది. ఈ ఘర్షణ ఎల్లప్పుడు కొనసాగుతూ ఉంటుంది. ఆఖ్యానం అంటే ల్యూతర్ ప్రకారం సాంస్కృతిక సంప్రదాయాల పరంపర. ఇది ఒక మిథ్. పుక్కిటి పురాణాలు, కాల్పనిక కథల కోవకు చెందినది. ఫిలసఫీని కూడా ల్యూత్యార్ ఈ కోవలోనే పరిగణించాడు. ల్యూతార్ ప్రకారం ఆఖ్యానమే సామాజిక కట్టుబాట్లు, నియమాలు, సంబంధాలు, మంచి చెడులు, తప్పొప్పులను గుర్తించడం జరుగుతుంది. సాంస్కృతిక సంప్రదాయాల ప్రమాణాలను కూడా ఇదే నిర్ధారిస్తుంది. ఆఖ్యానం సమాజంలో మానవ సంబంధాల వ్యవస్థను గుర్తించడం మాత్రమే కాదు, స్వభావము, ప్రవృత్తి రీత్యా కూడా మానవ సంబంధాలకు అద్దంపడుతుంది. ఏ సమాజంలో అయినా సౌందర్యం, సత్యం, శ్రేయాల ప్రమాణాలు దీనివల్లనే నిర్ధారితమవుతాయి. అంతేకాదు, సాముదాయిక బుద్ధిచైతన్యాలు, వివేక

వివేచనలు కూడా దీనివల్లనే సంభవిస్తాయి. క్లుప్తంగా చెప్పాలంటే ఏ సంస్కృతిలో అయినా సరే సామాజిక కట్టుబాట్లు, నియమాలు, సామాజిక వైఖరుల రూపకల్పన, అలాగే మూల్యాల నుంచి జనించే సంస్కారం, సభ్యతలు అన్నీ దీనిలో చేరి ఉన్నాయి. ఈ నెరెటివ్‌ను తయారు చేసేది అధికారాసనాలే అనేది గమనించడం ముఖ్యం.

ల్యూతార్ ఈ విషయమై మరిన్ని వివరాలు తెలియజేశాడు. విజ్ఞాన సాంకేతిక శాస్త్రాలు ప్రగతి సాధించినప్పటికీ నెరెటివ్ తప్పనిసరిగా తన ప్రాముఖ్యాన్ని కొనసాగిస్తుంది. ఇవి రెండు సమాంతర వాస్తవాలు. ఇవి రెండు జ్ఞానానికి సంబంధించిన రెండు పార్శ్వాలు. సాంకేతిక పారిభాషికాల రీత్యా చూస్తే ఇవి భాషాపరమైన క్రీడలు. సైన్సుకు సంబంధించిన జ్ఞానానికి రుజువులు నిరూపణలు కావాలి. కాని నెరెటివ్‌కి రుజువులు, నిరూపణలు అవసరం లేదు. ఈ నెరెటివ్‌కు మూల కేంద్రం అధికారమే. అది వ్యవస్థీకృత అధికారం కావచ్చు, లేదా అవ్యవస్థీకృతంగా ప్రజల మనో మస్తిష్కాలను ప్రభావితం చేసేది కావచ్చు. అధికారం ఏదైనా సరే దానికి వనరులపై నియంత్రణ ఉంటుంది. ఈ నియంత్రణ నెరెటివ్‌ను నియంత్రించడానికి ఉపయోగపడుతుంది. సైన్సు ఎంతగా నెరెటివ్‌ను వ్యతిరేకించినా, నెరెటివ్ పరిధుల నుంచి బయటకు వెళ్ళడం జరగదు. క్లుప్తంగా చెప్పాలంటే అధికారమే సైన్సు దిశను కూడా నిర్దేశిస్తుంది. అధికారమే సమాజంలో నెరిటివ్ దిశను కూడా నియంత్రిస్తుంది. తుదకు అధికారమే జ్ఞానాన్ని కూడా నియంత్రిస్తుంది. నెరెటివ్ నియంత్రణల ఫలితమే నేడు చాట్ జిపీటీ వంటి టూల్స్‌లో కూడా కొన్ని వివక్షల ప్రతిస్పందనలు చూడగలిగాం. గమనించవలసిందేమిటంటే, ఇదంతా డాటా క్రీడ. ఏ డాటా యంత్రానికి అందుతుందో ఆ డాటా ప్రకారమే యంత్రం ఆలోచిస్తుంది. ఈ డాటాను అందించేది సమాజం, ప్రజలు, వ్యక్తులు. ఏ నెరెటివ్ ప్రబలంగా ఉందో అలాంటి డాటాయే సమాజం యంత్రానికి కూడా ఇస్తుంది. తుదకు జ్ఞానంపై నియంత్రణ ఉన్నవారి మాటే చెల్లుబాటయ్యే వాతావరణం ఏర్పడుతుంది.

జ్ఞానం అంటే చాలా సమాచారం గురించి తెలిసి ఉండడం ఒక ఎత్తయితే, సమాచారాన్ని సమన్వయపరచి వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకునే వివేచన రెండో ఎత్తు. ప్రస్తుతం ఈ రెండు పనులు కూడా కృత్రిమ మేథస్సు చేసేస్థాయిలో ఉంది. అంటే కృత్రిమ మేధస్సును ఎవరు నియంత్రించగలరో వారే జ్ఞానాన్ని నియంత్రించగలరు. నాగరికతల గమనాన్ని నియంత్రించగలరు. కాబట్టి నాగరికత దిశను నిర్ణయించేది నెరెటివ్. అలాగే నాగరికత దశను కూడా ఈ నెరెటివే నిర్ణయిస్తుంది. ఒక దశ దాటిన తర్వాత నాగరిక దశ నుంచి మాలిక్ బిన్నబీ చెప్పిన నాగరికోత్తరదశ వైపు నాగరికతను నెట్టడంలో కూడా నెరెటివ్ ప్రధాన పాత్ర పోషించ వచ్చు. ఈ మొత్తం వ్యవహారంలో మనిషి ఒక వ్యక్తిగా ఎక్కడ నిలబడి ఉన్నాడన్నది ఆలోచించడం ముఖ్యం. మనిషి ఆలోచనలు, భావాలు, వైఖరులు అన్నంటిని నెరెటివ్, డిస్కోర్స్ ప్రభావితం చేయడం మాత్రమే కాదు, నిజానికి మనిషి ఆలోచన, నెరెటివ్ నుంచే జన్మిస్తుంది. అలాంటి నెరెటివ్, అలాంటి డిస్కోర్స్ స్థిరమైన నైతిక పునాదులపై నిలకడగా ఎలా ఉంచగలం. ఇస్లామీయ సామాజిక వ్యవస్థను అధ్యయనం చేస్తే జవాబులు దొరకవచ్చు.


## చందాదారులకు విజ్ఞప్తి

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి అబ్దుల్ జలీల్: 9704317015

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు **Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

# ఇస్లాంలో స్త్రీకి సముచిత స్థానం

- ముహమ్మద్ వహీదుద్దీన్

**మహిళలు** సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలు అన్నీఇన్నీ కావు. ఆడపిల్లల వివక్ష, నిరక్షరాస్యత, గృహ హింస, వరకట్న దురాచారం నేటి సమాజంలో సర్వ సాధారణమయ్యాయి. గ్రామాలలో నేటికీ బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. అత్యాచారాల పర్వం మహిళలను క్రూరంగా బలిగొంటుంది. వ్యాపార ప్రకటనలు, అందాల పోటీలు స్త్రీలను బజారుకీడుస్తున్నాయి. మహిళలపై దాడులు, దౌర్జన్యాలు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు అనే తేడా లేకుండా వేధింపులు పెరుగుతూనే ఉన్నాయి. చివరికి చట్టాలు చేసే అసెంబ్లీ, పార్లమెంట్‌లోని మహిళా సభ్యులు కూడా వేధింపులకు గురవుతున్నారు. అన్ని రకాలుగా అణచివేతలో మగ్గిపోతున్న మహిళల విముక్తికి సామాజిక మార్పు చాలా అవసరం.

మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, వేధింపులు నిరోధించేందుకు ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉంది పరిస్థితి.

### ఇల్లాలే మహరాణిగా...

కుటుంబ వ్యవస్థలో స్త్రీని పురుషునికి సహాయకారిగా చేయడం జరిగింది. అంటే దీనర్థం ఆమె పురుషునికంటే తక్కువ అని ఏ మాత్రం కాదు. భార్యగా ఆమెకు మహారాణి స్థానం కల్పించింది ఇస్లాం. కుటుంబ బాధ్యతల నిర్వహణలో భార్యను కేవలం వంటింటి కుందేలుగా కాకుండా ప్రత్యేక హోదా ఇవ్వడం జరిగింది.

### నినాదాలే తప్ప ఆచరణ ఏది?

స్త్రీ సాధికారత, స్త్రీ సమానత, స్త్రీ హక్కులు సాధించడం కోసం ఎన్నో సంఘాలు, సంస్థలు ఉద్యమాలు మొదలయ్యాయి. స్త్రీల హక్కుల కోసం పోరాడటం కోసం స్త్రీ వీధికి ఎక్కవలసిన పరిస్థితులు సృష్టించారు. స్త్రీ సమానత్వం అవసరం అంటూ ఆమెను అంగడి బొమ్మగా వాడుకుంటున్నారు. మహిళా సంఘాలు ఎంత గొంతు చించుకున్నా, ఎన్ని ఉద్యమాలు చేసినా మహిళను వినిమయ వస్తువుగా వాడుకోవడం మాత్రం స్వేచ్ఛగా, నిరాటంకంగా జరుగుతూనే ఉంది.

### ఇస్లాంలోనే స్త్రీకి సముచిత స్థానం


స్త్రీల కోసం అంటూ ప్రత్యేక చట్టాలు ఏర్పరచబడి ఉన్నాయి. అయినప్పటికీ ప్రతి ఏటా ప్రపంచంలో 40శాతం మహిళలు లైంగిక వేధింపులకు గురవుతున్నారు. 7వ శతాబ్దానికి పూర్వం అరబ్బు దేశాలలో కూడా ఇంచుమించు స్త్రీల పరిస్థితులు ఇదేవిధంగా ఉన్నాయి. కాని ఇస్లాం సమాజంలో వారికి సముచిత స్థానం కల్పించింది. ఆస్తిలో వారికి వాటాను నిర్ణయించింది. దాంపత్య జీవితంలో స్త్రీ పురుషుల హక్కులు, బాధ్యతలు నిర్ణయించింది. స్త్రీకి కూడా ప్రత్యేక వ్యక్తిత్వం ఉన్నదని ఘోషించింది. ఇస్లామ్ తీసుకువచ్చిన ఈ మార్పులన్ని కేవలం చట్టాలు, తీర్మానాలు చేయడం వల్ల ప్రాప్తించినవి కావు. ఇస్లామ్ ధర్మాన్ని ఆచరణలోనికి తీసుకువచ్చిన మహనీయ దైవప్రవక్త(స) మహిళల ప్రగతికి పునాదులు వేసి వారి పట్ల అనుసరించిన వైఖరి వల్ల సమాజంలో స్త్రీకి గొప్ప స్థానంతోపాటు గౌరవం కూడా దక్కింది.

### ఇస్లాం మహిళలకిచ్చిన విద్యాహక్కు

పుష్పానికి పరిమళం, సూర్యునికి కిరణం, చంద్రునికి వెన్నెల, నక్షత్రాలకు మిణుకు, గాలిలో చల్లదనం, కంటికి దృష్టి ఎంత సహజమో స్త్రీలకు విద్య అనే ఆభరణం అంతే అవసరం. విద్య మనిషి జ్ఞాన వికాసానికి మూలం. వ్యక్తిత్వాన్ని, స్వభావాలను తీర్చిదిద్దడంలో నైతికత, ఆధ్యాత్మికత, ఆర్థిక వికాసాలకు కూడా ఇదే కీలక పాత్ర వహిస్తుంది.

ప్రతి విద్యావంతుడైన పురుషుడు తల్లి ఒడి అనే బడి ప్రాథమిక శిక్షణ ముగించుకుని, ఆమె పరిశీలనాత్మక పెంపకంలో నైతికత, ఆధ్యాత్మికత అలవర్చుకోవలసి ఉంటుంది. ఆ తరువాతే అన్ని ప్రాపంచిక పరీక్షలను ఎదుర్కొంటాడు. కాబట్టి సహజంగా అన్ని ధర్మాలు ఆ మొదటి గురువులైన అతివలకు పురుషులతోపాటు విద్యాభ్యాసం హక్కును ప్రసాదించాయి.

అంతిమ దైవప్రవక్త(స) గారిని చదువు అనే ఆజ్ఞతో విద్య, వివేకం నేర్పించి మానవ జీవితంలో (స్త్రీ పురుష భేదం లేకుండా) విద్య విలువను, ప్రాముఖ్యతను తెలియపరిచాడు దైవం. ఆ తరువాత దైవం పట్ల విశ్వాసంతోపాటు విద్యనభ్యసించిన వారికి ప్రాపంచిక జీవితంలోనే కాక పరలోక జీవితంలో కూడా ఉన్నత స్థానాలను అందజేయడం జరుగుతుందని తెలియపరిచింది అంతిమ గ్రంథమైన దివ్య ఖుర్‌ఆన్.





**- యం.డి. ఉస్మాన్‌ఖాన్**
**సీనియర్ జర్నలిస్ట్**


**గాంధీజీని చంపిందెవరు...** అంటే అందరూ ఆరెస్సెస్ కార్యకర్త 'నాథూరాం గాడ్సే' అని ఠక్కున చెప్పేస్తారు. కాని గాంధీజీ ప్రాణాలు కాపాడిందెవరు.? అంటే ఎంత మంది సమాధానం చెప్పగలరు ? అవును.. తన ప్రాణాలను పణంగా పెట్టి బాపూజీ ప్రాణాలను రక్షించిన వ్యక్తి ఒకరున్నారు. ఆయనే బతక్ మియా అన్సారీ. మియాసాబ్ గనక ఇంగ్లీషు దొర ఇర్విన్‌కు భయపడో, ప్రలోభపడో ఉంటే గాంధీలాంటి నాయకుడు మనకు మిగిలేవాడు కాదు.

భారతదేశంలో స్వాతంత్రోద్యమం చిగుర్లు తొడుగుతున్న తొలినాళ్ళ లోనే మహాత్ముడి హత్యకు జరిగిన కుట్రను భగ్నం చేసి, ఆయన ప్రాణాలు రక్షించి దేశానికి మహాత్ముడి నాయకత్వం అందేలా చేసిన మహావ్యక్తి బతక్ మియా అన్సారీ. బీహార్ రాష్ట్రంలోని మోతీహార్ అనే గ్రామంలో 1869 జూన్ 25 తేదీన ఆయన జన్మించారు. ఇమ్రా ఖాతూన్, ముహమ్మద్ అలీ మియా అన్సారీ తల్లిదండ్రులు. బీహార్‌లోని బాగా వెనుకబడిన చంపారణ్ జిల్లాలో తెల్లదొరలు, వారి వంది మాగదులూ ఆహార పంటలు వదలి, నీలిమందు లాంటి వాణిజ్య పంటలు పండించమని రైతులను నిర్బంధించేవారు. పండించిన పంటకు అర కొర ధర ముట్టచెప్పేవారు. ధర గిట్టుబాటు కాకపోయినా, ఆకలితో మాడి చచ్చినా రైతులెవరూ నోరు తెరిచే సాహసం చేసేవారుకాదు. నోరు తెరిచి మొత్తుకున్నా వారి మాట వినే నాధుడెవడూ ఉండేవాడు కాదు. కాస్త గట్టిగా మాట్లాడితే రకరకాలుగా హింసించి, ఉక్కుపాదంతో అణిచి వేసేవారు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో, చంపారణ్ ప్రాంతానికి చెందిన రాజ్ కుమార్ శుక్లా, పీర్ ముహమ్మద్ మోనిస్ అన్సారీలు, రైతుల గోసను గాంధీజీకి వివరించి, చంపారణ్ రైతులను పరామర్శించమని అభ్యర్థించారు. దీంతో 1917 ఏప్రిల్ 15న గాంధీజీ చంపారణ్ జిల్లాలోని మోతీహార్ గ్రామం చేరుకున్నారు. మోతీహార్ రైల్వే స్టేషన్‌లో గాంధీజీకి ఘనస్వాగతం లభించింది. నీలిమందు రైతుల్లో గాంధీజీకి ఉన్న ఆదరణ చూసి తెల్ల దొరలకు వెన్నులో వణుకు పుట్టింది. ఎలాగైనా గాంధీ అడ్డు తొలగించుకోకపోతే తమ ఆటలు సాగవని భావించిన ఆంగ్ల అధికారి 'ఇర్విన్' ఓ కుట్ర పన్నాడు. గాంధీజీని భోజనానికి ఇంటికి ఆహ్వానించి, చంపెయ్యాలన్నది ఆ దుర్మార్గపు ఆలోచన. దీని కోసం తన వంట మనిషి బతఖ్ మియా అన్సారీని వాడుకోవాలని భావించాడు. వెంటనే అన్సారీని పిలిచి, గాంధీ మన ఇంటికి భోజనానికి వచ్చినప్పుడు, పాలలో విషం కలిపి ఇవ్వాలని,

ఏమాత్రం అనుమానం రాకుండా పథకం అమలు చేయాలని, జీతం పదింతలు పెంచుతానని, మంచి నజరానాతో పాటు, విలువైన భూములు కానుకగా ఇస్తానని వాగ్దానం చేశాడు. పథకం ఏ మాత్రం విఫలమైనా, తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించాడు. 'ఇర్విన్' మనస్తత్వం బాగా తెలిసిన మియా అన్సారీ మౌనంగా ఉండిపొయ్యాడు. అనుకున్నట్లుగానే గాంధీజీ ఇర్విన్ ఇంటికి వచ్చారు. ఆయన వెంట డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ కూడా ఉన్నారు. ఇర్విన్ స్వయంగా దగ్గరుండి విషం కలిపించిన పాలను గాంధీజీకి ఇవ్వమని అన్సారీని పురమాయించాడు. ఇర్విన్ ఆజ్ఞను ధిక్కరిస్తే జరిగే పరిణామాలను తలచుకుంటూనే, గాంధీజీ ప్రాణాలను రక్షించవలసిందేనని నిశ్చయించుకున్నాడు అన్సారీ. వెంటనే విషయాన్ని గాంధీజీ కి చెప్పి ఆయన ప్రాణాలు కాపాడాడు. అన్సారీ గుండె ధైర్యం, ఆయన చూపిన తెగువ, దేశం పట్ల, గాంధీజీ పట్ల ఆయనకున్న ప్రేమ కారణంగా, 1917లో గాంధీజీ ప్రాణాలతో బయటపడి, స్వాతంత్రోద్యమంలో కీలక పాత్ర పోషించగలిగారు. హత్యా పథకం విఫలం కావడంతో ఇర్విన్ అగ్గి మీద గుగ్గిలమయ్యాడు. నా బానిసవై ఉండి నా మాటే వినవా? అంటూ తీవ్రమైన చిత్ర హింసలకు గురిచేశాడు. ఆయన్ని, ఆయన కుటుంబీకుల్ని తీవ్రంగా వేధించాడు. అన్సారీ ఇంటినీ, కొద్దిపాటి భూమినీ జప్తు చేసుకొని, ఊరి నుండి వెళ్ళగొట్టాడు. తను ఏమైపోయినా పరవాలేదు, గాంధీజీ ప్రాణాలు కాపాడగలిగానన్న తృప్తితో, కట్టుబట్టలతో కుటుంబాన్ని తీసుకొని ఊరు వదిలి వెళ్ళిపోయారు గాంధీజీ ప్రాణ దాత బతక్ మియా అన్సారీ. గాంధీజీ నాయకత్వంలో సాగిన చంపారణ్ సత్యాగ్రహ ఉద్యమం చివరికి విజయవంతమైంది. Champaran Agrarian Act Of 1918 పేరుతో చట్టంగా కూడా రూపుదాల్చింది. కాని, తన సర్వస్వాన్నీ పణంగా పెట్టి గాంధీజీ ప్రాణాలు కాపాడిన బతఖ్ మియా అన్సారీని మాత్రం అందరూ మరిచిపొయ్యారు. 1950లో భారతదేశ మొదటి రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్ మోతీహార్ వెళ్ళిన సందర్భంగా సభలో ప్రసంగిస్తున్నప్పుడు, సభికుల్లో నుండి ఓ వృద్ధుడు వేదిక వైపు రావడానికి ప్రయత్నించడం, పోలీసులు అతన్ని నిలువరించడం జరిగింది. ఈ దృశ్యాన్ని చూసిన డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఆ వృద్ధుణ్ణి గుర్తుపట్టి తన వద్దకు తీసుకురావాలని ఆదేశించారు. వెంటనే పోలీసులు ఆ వృద్ధుణ్ణి వేదిక పైకి తీసుకువెళ్ళారు. బాబూ రాజేంద్రప్రసాద్ అతణ్ణి ఆప్యాయంగా, ఎంతో భావోద్వేగానికి లోనవుతూ గుండెలకు హత్తుకున్నారు. యోగ క్షేమాలు విచారించి వేదికపై తన పక్కనే కూర్చోబెట్టుకున్నారు. ఈ హఠాత్ పరిణామానికి అచ్చెరువొంది, సంభ్రమాశ్చర్యాలకు లోనైన సభికులకు 1917 నాటి ఆ వృత్తాంతమంతా పూస గుచ్చినట్టు వివరించారు బాబూ రాజేంద్ర ప్రసాద్. ఆ రోజు బతఖ్ మియా అన్సారీ గాంధీజీ ప్రాణాలు రక్షించిన సంఘటనకు ఆయనే ప్రత్యక్ష సాక్షి. తరువాత గాంధీజీ ప్రాణాలు కాపాడినందుకు ఆంగ్ల అధికారి ఇర్విన్ ఏవిధంగా వేధించాడో, ఎన్ని చిత్ర హింసలు పెట్టి తననూ, తన కుటుంబాన్నీ వీధి పాలుచేశాడో, తాము ఏ విధమైన బాధలు భరించారో అంతా డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ కు వివరించారు అన్సారీ. ఈ బాధామయ గాథ విన్న రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్.. అన్సారీ, ఆయన ముగ్గురు కుమారులు షేర్ ముహమ్మద్ అన్సారీ, ముహమ్మద్ రషీద్ అన్సారీ, ముహమ్మద్ జమాల్ అన్సారీల కుటుంబాలకు యాభై ఎకరాల భూమిని కేటాయించాల్సిందిగా అప్పటికప్పుడు జిల్లా కలెక్టరుకు ఆదేశాలు జారీచేశారు. స్వయంగా భారత రాష్ట్రపతే ఆదేశాలు జారీ చేసేసరికి, ఇక తమ పేదరికం వదిలినట్లేనని సంతోషించిన అన్సారీ కుంటుంబానికి ఆ సంతోషం కూడా ఎన్నాళ్ళో నిలువలేదు. చెప్పులరిగేలా ఏడేళ్ళపాటు కార్యాలయాల చుట్టూ తిరిగినా రాష్ట్రపతి ప్రకటించిన భూమి జాడ కనిపించలేదు. చివరికి 1957 డిసెంబర్ నాలుగో తేదీన అన్సారీ అనంత లోకాలకు వెళ్ళిపోయారు. ఈ విషయం తెలుసుకున్న అప్పటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ అన్సారీ కుటుంబీకులను రాష్ట్రపతి భవన్‌కు పిలిపించుకొని పరామర్శించారు. తననూ, తన కుటుంబాన్నీ లెక్క చేయకుండా, మహాత్ముని ప్రాణాలు కాపాడిన బతఖ్ మియా అన్సారీకి తగిన న్యాయం జరగకపోగా, చరిత్ర కూడా ఆయన త్యాగాలను విస్మరించడం మరో విషాదం. మొత్తంమీద ఒక ఆరు ఎకరాల భూమిని ఓ నది ఒడ్డున జిల్లా కలెక్టర్ కేటాయించారు. ప్రస్తుతం నది కోతకు గురై ఐదెకరాలు మాయమైంది. కేవలం ఒక్క ఎకరం మాత్రమే మిగిలింది. ఇప్పటికీ తమకు రావలసిన భూమి కోసం అన్సారీ కుటుంబీకులు అర్జీలు పట్టుకొని తిరుగుతూనే ఉన్నారట.


పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# ఉర్దూ భాషాభివృద్ధికి గొప్ప ప్రయత్నం - క్విజ్ టైమ్



**- ముహమ్మద్ అజ్గర్ అలీ**

ముంబైలోని క్విజ్ టైమ్ వ్యవస్థాపకుడు, చైర్మన్ హమీద్ ఇక్బాల్ సిద్ధిఖీ, ముంబై మెగాసిటీ అంతటా ఉర్దూ భాషను ప్రోత్సహించడానికి మూడు దశాబ్దాలకు పైగా ఉర్దూలో జనరల్ నాలెడ్జ్ క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నారు. హమీద్ ఇక్బాల్ సిద్ధిఖీ 275 కంటే ఎక్కువ ఉర్దూ జనరల్ నాలెడ్జ్ క్విజ్ షోలను నిర్వహించారు.

ఉర్దూ మాధ్యమంలో చదువుకునే విద్యార్థులకు సుపరిచితమైన పేరు హమీద్ ఇక్బాల్ సిద్ధిఖీ. "సూపర్ స్టార్ ఆఫ్ ఉర్దూ స్టూడెంట్స్"గా ఆయన పేరుపొందారు. టైమ్స్ ఆఫ్ ఇండియా మాగజైన్ "సిటీ ఏంజెల్" బిరుదుతో హమీద్ ఇక్బాల్ సిద్ధిఖీని సత్కరించింది.

హమీద్ ఇక్బాల్ సిద్ధిఖీ అభిప్రాయంలో సిలబస్‌తో పాటు పిల్లలకు కళలు, సైన్స్, క్రీడలు, టెక్నాలజీ, రాజకీయాలు, నాగరికత, సంస్కృతి, సినిమా, వైద్యం, చరిత్ర, గణితం, కరెంట్ అఫైర్స్ మొదలైన వాటిపై మంచి పరిజ్ఞానం ఉండాలి.

"పిల్లలు జీవితంలో విజయం సాధించాలంటే జనరల్ నాలెడ్జ్ చాలా ముఖ్యం. దాదాపు ప్రతి పరీక్షలో జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు ఉంటాయి. శ్రద్ధ వహిస్తే పోటీ పరీక్షకు ప్రిపరేషన్ ప్రక్రియను ప్రాథమిక పాఠశాల నుండి ప్రారంభించవచ్చు" అంటారాయన.

హమీద్ ఇక్బాల్ సిద్ధిఖీ 1992-93 కాలంలో మొదట్లో మదర్సాలలో ఇస్లామిక్ క్విజ్ పోటీలు నిర్వహించేవారు. ఇస్లామిక్ క్విజ్ కార్య క్రమాలు విద్యార్థులలో బాగా ప్రాచుర్యం పొందాయి. ఆ తరువాత ఉర్దూలో జనరల్ నాలెడ్జ్ క్విజ్ పోటీలను నిర్వహించడం ప్రారం భించారు.

జనరల్ నాలెడ్జ్ పోటీలో పాల్గొనే పిల్లలకు బహుమతులు ప్రదానం చేస్తారు, పిల్లల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు బహుమతులు ఇస్తారు.

ఉర్దూ భాష చదివిన వారికి ఉపాధి అవకాశాలు లేవు అనేది అపోహ మాత్రమే అని క్విజ్ మాస్టర్ హమీద్ ఇక్బాల్ అంటారు. ఉర్దూను ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేస్తే ఉన్నత విద్య, ఫ్యాషన్, వినోదం వంటి అనేక రంగాలలో ఉద్యోగావకాశాలు ఉన్నాయి అని హమీద్ ఇక్బాల్ అన్నారు.

హమీద్ ఇక్బాల్ సంవత్సరాలుగా ఉర్దూ పాఠశాలల ప్రమాణాలు పెంచడానికి ప్రయత్నిస్తున్నారు. ఉర్దూ పాఠశాలల్లో ఈ-లెర్నింగ్ విధానం ప్రవేశపెట్టడానికి కృషి చేశారు.

క్విజ్‌టైమ్ ముంబై 1999లో మొదటి ఇంటర్-స్కూల్ జనరల్ నాలెడ్జ్ క్విజ్ పోటీని నిర్వహించింది. 2024లో 23వ వార్షిక జనరల్ నాలెడ్జ్ క్విజ్ పోటీ 'ధమాల్' నిర్వహించారు. 2024 ఫిబ్రవరిలో విజయవంతంగా నిర్వహించబడిన పోటీల్లో యాభై పాఠశాలలు పాల్గొన్నాయి.

సిద్ధిఖీ భార్య జాహిదా సంపూర్ణ సహకారం అందిస్తారు. జాహిదా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలు. తన జీతంలో కొంత భాగాన్ని ఉర్దూ జనరల్ నాలెడ్జ్ క్విజ్ పోటీలకు ఖర్చు చేస్తున్నారు.

హమీద్ ఇక్బాల్ సిద్ధిఖీ ప్రతి సంవత్సరం క్విజ్ టైమ్ ముంబై బ్యానర్‌పై 'ఉర్దూకి ముహబ్బత్ మే' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఉర్దూ భాష కోసం కృషి చేసిన వారికి 'ముహిబ్బె ఉర్దూ' అవార్డును అందజేస్తారు.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**